వీలేకరులు కావలెను
తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా వెలుబడుతున్న
ప్రజా స్వేచ్ఛ
PRAJA SWECHA
రాజకీయ, సామాజిక, సంస్కృతిక, మాసపత్రిక
తెలుగు మాసపత్రిక నందు పనిచేయుటకు
జర్నలిజంపై ఆసక్తి కలిగిన ప్రతి మండలం నుండి విలేఖరులు కావలెను
ఆసక్తి గలవారు సంప్రదించండి
+91 9381910611 , 7989289492

www.prajaswecha.com

# ప్రజా స్వేచ్ఛ

PRAJA SWECHA

రాజకీయ, సామాజిక, సంస్కృతిక, మాసపత్రిక




| హైదరాబాద్ | సంచిక : 6 | సంపుటి : 2 | ఎడిటర్ : తరిగొప్పుల లక్ష్మి మహేందర్ ప్రజాపతి | జూలై 2025 | వెల : రూ 10/- |
|---|---|---|---|---|---|

# స్థానికంలో 42 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తాం

**-దానికీ వ్యూహం ఉంది**
**-గంజాయి బ్యాచ్ వ్యాఖ్యలు పట్టించుకోం**
**-కేసీఆర్ తెలంగాణ ద్రోహి**
**-లోకేష్‌తో కేటీఆర్ ఎందుకు భేటీ అయ్యారు?**
**-బీఆర్ఎస్ నేతలు ప్రశ్నించాలి : ఢిల్లీ మీడియాతో ఇష్టాగోష్టిలో సీఎం రేవంత్‌రెడ్డి**





తెలంగాణ న్యాయవాదుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి రిటైర్ జడ్జి కాంగ్రెస్ నాయకుడు రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి

**న్యూఢిల్లీ బ్యూరో,ప్రజా స్వేచ్ఛ**
స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం బీసీ రిజర్వేషన్లు అమలు చేసి తీరుతామని ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. ఈ విజయాన్ని సహించలేని వాళ్ళు ఎస్సీ వర్గీకరణ, కుల గణన సర్వేపై కూడా ఇలాంటి విమర్శలే చేశారని గుర్తుచేశారు. కానీ వారి అంచనాలకు మించి అన్నింటినీ విజయవంతంగా చేసి చూపించామని చెప్పారు. కోర్టు ఆదేశాల ప్రకారం సెప్టెంబర్ 30 లోపు స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు సిద్ధం అవుతున్నామని తెలిపారు. దానికోసమే 42 శాతం బీసీ రిజర్వేషన్ల ఆర్డినెన్స్ తెస్తున్నామన్నారు. గురువారం ఢిల్లీలో ఆయన మీడియాతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. నాడిక్కడ ఆయన మీడియాతో మాట్లాడారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి లేఖలు రాయడం కాదనీ, తెలంగాణ అభివృద్ధి అంశాలపై ఎజెండా పెట్టుకొని పిలిస్తే మంత్రులు, అధికారులను పంపిస్తామనీ, అవసరమైతే తాను, డిప్యూటీ సీఎం కూడా వెళ్తామని చెప్పారు. ఇది ఫెడరల్ వ్యవస్థని మేం ముందునుండి చెబుతున్నామనీ, అభివృద్ధి కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి పని చేయాలని అన్నారు.

## అక్కడ చేసి, ఇక్కడకు రండి

స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ముస్లింలకు రిజర్వేషన్లు ఉన్నాయి. ప్రధాని మోడీ సొంత రాష్ట్రం గుజరాత్, ఆయన ఎంపీగా ప్రాతినిధ్యం వహిస్తున్న ఉత్తరప్రదేశ్, ఆర్ఎస్ఎస్ స్థాపించిన మహారాష్ట్రలోనూ ముస్లింలకు రిజర్వేషన్లు అమలవుతున్నాయి. మొదట ఈ మూడు రాష్ట్రాల్లో ముస్లింలకు రిజర్వేషన్లు తొలగించి, కేంద్రమంత్రులు బండి సంజరు, కిషన్‌రెడ్డి తెలంగాణలో రిజర్వేషన్లపై మాట్లాడాలని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టంచేశారు.

## నీటి కోసం రోడ్‌మ్యాప్

తెలుగురాష్ట్రాల ముఖ్యమంత్రుల సమావేశంలో తెలంగాణ భవిష్యత్ నీటి అవసరాల కోసం స్పష్టమైన రోడ్ మ్యాప్ తమదగ్గర ఉన్నదని రేవంత్‌రెడ్డి తెలిపారు. కృష్ణా, గోదావరి బేసిన్‌లో ఉన్నవి, కొత్తగా చేపట్టే ప్రాజెక్ట్ లు, నీటి కేటాయింపులు సహా అన్నింటినీ, ఇకపై నూతన కమిటీ చూస్తుందని తెలిపారు. ఈ కమిటీలో పరిష్కారంకాని అంశాలను సీఎంల స్థాయిలో చర్చిస్తామన్నారు. ఇచ్చంపల్లి-కావేరి వయా శ్రీశైలం నదుల అనుసంధానం అంశం కేంద్రం ప్రతిపాదించిం దని చెప్పారు. 'మేం ఇంజనీర్లం కాదు. రాజకీయ కార్యనిర్వాహకులం. సాంకేతికంగా, చట్టాలు అనుమతిస్తే ముందుకెళ్తాం. భవిష్యత్ అవసరాలు, సమాజంలో మార్పులు, సాంకేతికతను దృష్టిలో పెట్టుకుని నిర్ణయాలు తీసుకుంటాం' అని చెప్పారు.

## తెలంగాణ ద్రోహి కేసీఆర్

బీఆర్ఎస్ హయాంలో కృష్ణా బేసిన్‌లో ఏపీకి 4.1 టీఎంసీలు ఉంటే, రాయలసీమకు శ్రీశైలం బ్యాక్ వాటర్ ద్వారా 9.6 టీఎంసీలను మళ్లించారని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. 2004-2014 కాంగ్రెస్ హయాంలో రాయలసీమకు 728 టీఎంసీలు పోతే, 2014-23 వరకు 1,200 టీఎంసీలు తరలించారని గుర్తుచేశారు. కేసీఆర్ తెలంగాణ ద్రోహి అనడానికి ఇది సరిపోతుంది. ఇప్పుడు రాయలసీమకు నీళ్లు ఆపి, శ్రీశైలం బ్యాక్ వాటర్ ఆపేస్తే కాంగ్రెస్ ప్రభుత్వం తప్పుచేస్తున్నట్లా? దీనిపై కేంద్రం, ఏపీతో చర్చకు పోకపోతే, ఎర్రవల్లి ఫాం హౌస్‌కు పోవాలా? అని ఎద్దేవా చేశారు. అపెక్స్ కౌన్సిల్ మీటింగ్‌లో అప్పట్లో రెండుసార్లు కేసీఆర్, హరీశ్‌రావులు పాల్గొన్నారు. ఇప్పుడు మేం పాల్గొన్నాం.దీంటో తప్పేముంది?

## లోకేశ్‌తో కేటీఆర్ భేటీలో ఆంతర్యమేంటి?

తాను ఏపీ సీఎంతో అధికారికంగా చర్చలో పాల్గొంటే తప్పుబడుతున్న కేటీఆర్, అసలు ఆ రాష్ట్ర మంత్రితో చీకటి భేటీలో ఎందుకు పాల్గొన్నారు? హైదరాబాద్‌లో మూడు సార్లు లోకేశ్‌తో కేటీఆర్ భేటీ కావడం వాస్తవం కాదా? అని సీఎం రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. ఈ విషయాన్ని బీఆర్ఎస్ నేతలు ఎందుకు తప్పుపట్టట్లేదు. ఈ విషయంలో ఫోన్ ట్యాపింగ్ చేయాల్సిన అవసరం మాకేం లేదు.

## హైకోర్టు నేతృత్వంలోనే ఫోన్ ట్యాపింగ్ కేసు

ఫోన్ ట్యాపింగ్ కేసును రాష్ట్ర హైకోర్టు సుమోటోగా తీసుకొని మానిటరింగ్ చేస్తోందని సీఎం చెప్పారు. గతంలో కేంద్ర హోం శాఖ సహాయ మంత్రిగా తన ఫోన్ ట్యాప్ అయిందన్న కిషన్‌రెడ్డి ఇప్పటి వరకు ఎందుకు ఫిర్యాదు చేయలేదో ప్రజలకు చెప్పాలన్నారు. ప్రస్తుతం ఈ కేసులో కేసీఆర్‌ను కాపాడేందుకే కేంద్రానికి ఫోన్ ట్యాపింగ్ కేసు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారని అన్నారు. 'కేంద్ర విదేశాంగ శాఖ, ఇతర శాఖల వల్లే ఈ కేసులో కీలక నిందితుడు ప్రభాకర్‌రావును తీసుకురావడంలో ఏడాదిన్నర ఆలస్యమైందన్నారు.

## బీజేపీది స్వార్థం


ఫోన్ ట్యాపింగ్ కేసును కేంద్రానికి అప్పగించాలని కోరుతున్న కేంద్రమంత్రి కిషన్ రెడ్డి తెలంగాణలో కీలక కేసులన్నీ ఈడీకి అప్పగిస్తే ఏం చేసిందని ప్రశ్నించారు. గొర్రెల స్కీం, ఈ ఫార్ములా రేసు సహా ఇతర కేసులన్నింటిని ఈడీ దర్యాప్తు చేస్తోందన్నారు. ఈ కేసులకు సంబంధించి అడిగిన అన్ని వివరాలను కేంద్ర దర్యాప్తు సంస్థకు అప్పగించామని చెప్పారు. అయినా ఇప్పటికీ కేటీఆర్‌ను ఎందుకు అరెస్ట్ చేయలేదన్నారు. కాళేశ్వరం ఇంజనీర్ల అక్రమ సంపాదన ఏంటనేది ఏసీబీ దాడులతో ప్రజలకు అర్థమవుతున్నదని అన్నారు.

## కొట్లాట చివరి అస్త్రం

కొట్లాట నా చివరి అస్త్రం. ఇదే ధోరణిలో కేంద్రం, పొరుగు రాష్ట్రం ఏపీతో వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నాం. కొట్లాడుకుంటూ పోతే ప్రజలకు నష్టం. సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న అనేక అంశాలపై కేంద్రం సానుకూలంగా స్పందించిందని ఆ వివరాలు వెల్లడించారు.

## గంజాయి బ్యాచ్‌కు నేను స్పందించాలా

కేటీఆర్‌ది గంజాయి బ్యాచ్. ఆ బ్యాచ్ సవాల్ విసిరితే నేను స్పందించాలా? అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. 'కేటీఆర్ బిజినెస్ భాగస్వామి కేదార్ రకరకాల డ్రగ్స్ ఒకేసారి తీసుకొని దుబాయ్‌లో ఆత్మహత్య చేసుకున్నాడు. ఆయన ఫోరెన్సిక్ రిపోర్ట్‌ను తెప్పించాం. త్వరలో బయట పెడతాం. కేటీఆర్ బామ్మర్ది ఫాంహౌజ్‌లో గంజాయి, డ్రగ్స్‌తో దొరికాడు. ఇలా కేటీఆర్ చుట్టు పక్కన ఉన్న వాళ్లంతా గంజాయి బ్యాచ్చే.. టెస్టుల కోసం రక్తం, జుట్టు ఇస్తా అని సవాల్ విసిరిన కేటీఆర్ మాటమార్చి కోర్టుకు పోయి ఆర్డర్స్ తెచ్చుకున్నాడు అని ఎద్దేవా చేశారు.




'కేసీఆర్ మా రాజకీయ ప్రత్యర్థి, ఆయన ప్రతిపక్ష నేతగా చేయాల్సింది చేయడం లేదు. ప్రధాన ప్రతిపక్ష నేత కేసీఆర్ వస్తే ఏ అంశంపైనైనా చర్చకు సిద్ధం'. అని రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. ఈ సందర్భంగా పలు అవినీతి అంశాలను ప్రస్తావించారు.

## బీసీల రిజర్వేషన్లు తగ్గించింది కేసీఆరే

2014కు ముందు బీసీలకు 34 శాతం రిజర్వేషన్లను కాంగ్రెస్ కల్పిస్తే, దాన్ని 23 శాతానికి తగ్గించింది కేసీఆరే అని ఆరోపించారు. బీజేపి ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షులు కే లక్ష్మణ్‌కే ఈ బిల్లు, ఆర్డినెన్స్‌పై అవగాహన లేదన్నారు.

## త్వరలో మహారాష్ట్ర పర్యటన

రాష్ట్ర ప్రయోజనాల కోసం త్వరలో మహారాష్ట్రకు వెళ్తానని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. తుమ్మిడి హట్టి ప్రాజెక్ట్ కోసం మహారాష్ట్రలో పర్యటిస్తాననీ, అక్కడి ప్రభుత్వంతో మాట్లాడతామనీ అన్నారు.

## కేటీఆర్ నాయకత్వాన్ని కవిత ఒప్పుకోవట్లేదు

కేసీఆర్ ఫ్యామిలీలో ఏ విషయంలోనూ ఏకాభిప్రాయం లేదని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. కేటీఆర్ నాయకత్వాన్ని కవితే ఒప్పుకోవడం లేదన్నారు. ఇండ్లలోనే వాళ్లకు విలువలేదనీ, ఇక ప్రజలకు ఏం చెప్తారని ఎద్దేవా చేశారు.

వీలేకరులు కావలెను
తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా వేలుబడుతున్న
ప్రజా స్వేచ్ఛ
PRAJA SWECHA
రాజకీయ, సామాజిక, సంస్కృతిక, మాసపత్రిక
తెలుగు మాసపత్రిక నందు పనిచేయుటకు
జర్నలిజంపై ఆసక్తి కలిగిన ప్రతి మండలం నుండి విలేఖరులు కావలెను
ఆసక్తి గలవారు సంప్రదించండి
+91 9381910611 , 7989289492

www.prajaswecha.com

# ప్రజా స్వేచ్ఛ

PRAJA SWECHA

రాజకీయ, సామాజిక, సంస్కృతిక, మాసపత్రిక



హైదరాబాద్ | సంచిక : 6 | సంపుటి : 2 | ఎడిటర్ : తరిగొప్పుల లక్ష్మి మహేందర్ ప్రజాపతి | జూలై 2025 | వెల : రూ 10/-



## బలూచి లిబరేషన్ దాడులు

- వరుస ఘటనలతో పాక్ సైన్యం ఉక్కిరిబిక్కిరి
- రెండ్రోజుల్లో 27మంది సైనికుల హతం

ఇస్లామాబాద్

బలోచ్ లిబరేషన్ ఆర్మీ పాకిస్థాన్ సైన్యానికి ఊపిరి సలుపనివ్వడం లేదు. వరుస దాడులతో విరుచుకు పడుతున్నారు. గత రెండ్రోజుల్లో 27 మంది పాక్ సైనికులను మట్టుపెట్టినట్లు ఆ సంస్థ ప్రకటించింది. ఈ విషయాన్ని ఆ సంస్థ ఓ సోషల్ మీడియా పోస్టులో వెల్లడించింది. బీఎల్ఏకు చెందిన ఫతే స్క్వాడ్ కలాత్‌లోని నిమ్రాగ్ క్రాస్ వద్ద సైనికులను తరలిస్తున్న ఓ బస్సును లక్ష్యంగా చేసుకొని దాడి చేసింది. ఇందులో 27 మంది సైనికులు చనిపోగా..

-మిగతా 3 లో



# కేసీఆర్ కుటుంబం కడుపునిండా విషమే

## ఢిల్లీకి వెళ్లకుండా ఫామ్‌హౌజ్‌కు వెళ్లాలా

- కేంద్రంతో చర్చించకుంటే సమస్యలకు పరిష్కారమెలా
- పక్క రాష్ట్ర సీఎంతో చర్చలు జరపకుంటే ఎలా
- తుమ్మడిహట్టికోసం మహా సీఎంతో మాట్లాడుతా
- కేంద్రమంత్రి కిషన్ రెడ్డి లేఖలు కాదు..ప్రణాళికతో రావాలి
- అన్ని కేసులపైనా పక్కా విచారణ జరుగుతోంది
- సీబీఐ పేరుతో రాజకీయం చేయాలనుకుంటున్న బీజేపీ
- తన సవాల్ కేసీఆర్ కే తప్ప కేటీఆర్‌కు కాదు
- విలన్లు ఎప్పుడూ క్లైమాక్స్‌లోనే అరెస్ట్ అవుతారు
- ఢిల్లీలో మీడియా చిట్‌చాట్‌లో సీఎం రేవంత్ రెడ్డి

న్యూఢిల్లీ ,

కేసీఆర్ కుటుంబం కడుపునిండా విషం పెట్టుకుని మాట్లాడుతోందని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి ఆరోపించారు. కేసీఆర్ అసెంబ్లీకి వచ్చి ప్రభుత్వానికి తగిన సూచనలు ఇవ్వాలని.. వాటిని స్వీకరించేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు. ఢిల్లీలో కేంద్ర మంత్రులతో జరిగిన సమావేశాల అనంతరం మీడియాతో చిట్‌చాట్‌లో సీఎం రేవంత్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. పలు అంశాలపై స్పష్టత ఇచ్చారు. తన పాలనపై విమర్శలు చేసే ప్రత్యర్థులపై సూటిగా వ్యాఖ్యలు చేశారు.

-మిగతా 3 లో



## ఉనికి చాటుకునేందుకు హరీష్ యత్నం

- పసలేని వాదనలతో ప్రజలను తప్పుదోవ పట్టించే చర్యలు
- అసెంబ్లీలో దమ్ముంటే ప్రాజెక్టులపై చర్చకు కేసీఆర్ రావాలి
- టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ విమర్శ

హైదరాబాద్ ,

హరీష్‌రావు ఆరు అడుగులు పెరిగాడే తప్ప అర అంగుళం మెదడు పెంచుకోలేదని టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ విమర్శించారు. హరీష్ రావు వాదనలలో పసలేదన్నారు. ఢిల్లీ మీటింగ్‌లో ఏం జరిగిందో కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్ చెప్పిన తర్వాత హరీష్ రావు పిచ్చి వాగుడు వాగుతూ తెలంగాణ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని మండిపడ్డారు. సిఎంల భేటీపై హరీష్‌రావు చేసిన వ్యాఖ్యలపై టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్

-మిగతా 3 లో



## బీహార్‌లో నితీష్ ఉచిత వల

- 125 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఆఫర్

పాట్నా,

బీహార్ అసెంబ్లీ ఎన్నికలు దగ్గరపడుతుండటం తో నితీష్ ప్రభుత్వం ఓటర్లపై ఉచితాల వలను ప్రయోగించింది. ప్రజలకు 125 యూనిట్ల వరకు విద్యుత్ ఉచితమని గురువారం ప్రకటించారు. మొదటి నుండి రాష్ట్రవ్యాప్తంగా తక్కువ ధరలకు విద్యుత్‌ను అందిస్తున్నాము. ఇప్పుడు ఆగస్ట్ 1 నుండి అంటే జులై బిల్లు నుండే రాష్ట్రంలోని గృహ వినియోగదారులు 125 యూనిట్ల విద్యుత్ వరకు ఎలాంటి నగదు చెల్లించాల్సి అవసరం లేదు. దీంతో రాష్ట్రంలోని మొత్తం 1.67కోట్ల కుటుంబాలకు ప్రయోజనం చేకూరుతుందని ఎక్స్‌లో పేర్కొన్నారు. రాబోయే మూడేళ్లలో గృహాల పైకప్పులపై లేదా ప్రభుత్వ స్థలాల్లో సౌరవిద్యుత్ పాలాంట్లను ఏర్పాటు- చేయాలని నిర్ణయించామని పేర్కొన్నారు. కుటీ-ర్ జ్యోతి పథకం కింద అత్యంత పేద కుటు-ంబాలకు, సౌరవిద్యుత్ పాలాంట్లకు అయ్యే ఖర్చును

-మిగతా 3 లో

## కేంద్ర మంత్రి బండికి సిట్ నోటీసులు

- ఈ నెల 24 న విచారణకు రావాలని సిట్ నోటీసు జారీ

హైదరాబాద్

ఫోన్ ట్యాపింగ్ కేసులో ఈనెల24న విచారణకు రావాలని కోరుతూ కేంద్ర మంత్రి బండి సంజయ్ కి సిట్ నోటీసులు జారీ చేసింది. కేంద్ర మంత్రితోపాటు పీఆర్వో, పీఏలకూ సిట్ పోలీసులు నోటీసులు జారీ చేశారు. హైదరాబాద్ లేక్

-మిగతా 3 లో



## ఉపాధి హామీ లో దక్షిణాదిలో ఏపీ ఆదర్శం

ఎక్స్ వేదికగా వెల్లడించిన పవన్ కళ్యాణ్



అమరావతి,

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం సోషల్ ఆడిట్‌లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం దక్షిణాది రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచిందని ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తెలిపారు. ఈ విషయాన్ని ఆయన తన ఎక్స్ వేదికగా పంచుకున్నారు.

-మిగతా 3 లో



## రాష్ట్రంలో శాంతి భద్రతలు లేవు

- బీఆర్ఎస్ నేతల ఇళ్లపై దాడులు
- కేటీఆర్‌పై చిల్లర విమర్శలు మానాలి
- బీఆర్ఎస్ నేత హరీష్ రావు విమర్శలు

హైదరాబాద్

రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ పూర్తిగా విఫలం అయిందని బిఆర్ఎస్ ఎమ్మెల్యే,మాజీ మంత్రి హరీశ్‌రావు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి ఇంటి పైన దాడి, నా క్యాంపు కార్యాలయం, పాడి కౌశిక్ రెడ్డి ఇంటి పైన, సునీత లక్ష్మారెడ్డి పైన , మర్రి రాజశేఖర్ రెడ్డిపైన దాడి చేస్తున్నారని ఆయన తెలిపారు. తెలంగాణ భవన్‌లో హరీశ్‌రావు మీడియాతో చిట్ చాట్ చేశారు. రాష్ట్రంలో పూర్తిగా శాంతి భద్రతలు కరువై హత్యలు, ఎక్కువ అవుతున్నాయి. కాంగ్రెస్ పార్టీ పాలనలో రాష్ట్ర ఆదాయం పడిపోయింది. చిల్లర మాటలు బంద్ చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశాడు. ఎవడో దుబాయ్‌లో చనిపోతే మా కేటీఆర్‌కు ఏం సంబంధం. ఆ రిపోర్ట్ నీ దగ్గర ఏమైనా ఉంటే రేవంత్ రెడ్డి ముక్కులో పెట్టు-కో. ఈడీ ఎందుకు రేవంత్ రెడ్డిని అరెస్ట్ చెయ్యడం లేదు, కిషన్ రెడ్డి రేవంత్ రెడ్డికి అండగా ఉంటు-న్నాడు. కేంద్రంతో సఖ్యతతో ఉంటానని పేరుకే అంటు-న్నావు, నీ వల్ల రాష్ట్రానికి ఒక్క ఉపయోగం జరగలేదు అని హరీశ్‌రావు పేర్కొన్నారు. కేటీ-ఆర్ పైన చేసిన ఆరోపణల్లో రుజువు ఉంటే చూపించు లేదంటే కేటీఆర్‌కు బహిరంగంగా క్షమాపణ చెప్ప రేవంత్ రెడ్డి. లోకేష్, కేటీఆర్‌ను అర్ధరాత్రి పూట కలిశాడు అని రేవంత్ రెడ్డి అంటున్నాడు. అర్ధరాత్రి పోయి కలిసే అలవాటు- రేవంత్ రెడ్డికే ఉన్నది,

-మిగతా 3 లో

## రష్యాతో ఇంధన ఒప్పందం చేసుకుంటాం

- ఆంక్షలు విధించడానికి మీరెవరూ!



న్యూఢిల్లీ ,

రష్యాతో ఇంధన ఒప్పందంపై అభ్యంతరాలు తెలుపుతూ నాటో చీఫ్ మార్క్ రుట్టే చేసిన వ్యాఖ్యలపై భారత్ మండిపడింది. రష్యాతో వాణిజ్య ఒప్పందాలు చేసుకునే దేశాలపై వంద శాతం సెకండరీ ఆంక్షలు విధిస్తామని హెచ్చరించడాన్ని భారత విదేశాంగ మీడియా ప్రతినిధి రణ్‌ధీర్ జైస్వాల్ తప్పుబట్టారు. ద్వంద్వ ప్రమాణాలను పాటించడం సరికాదని గురువారం పశ్చిమా దేశాలను జైస్వాల్ హెచ్చరించారు.నాటో చీఫ్ వ్యాఖ్యలను.. ప్రస్తుతం నెలకొన్న పరిణామాలను నిశితంగా

-మిగతా 3 లో

# నాపై డ్రగ్స్ కేసు నమోదైందా?



## దమ్ముంటే ఆధారాలు బయటపెట్టు..

- కనీసం అణువంత రుజువైనా ఉన్నదా?
- సీఎం రేవంత్‌కు కేటీఆర్ సవాల్

హైదరాబాద్

చిట్‌చాట్ పేరుతో రేవంత్ రెడ్డి ఢిల్లీలో చేసిన అడ్డగోలు వ్యాఖ్యలు, ఆరోపణలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధ్వజమెత్తారు. రేవంత్ రెడ్డి మీడియా చిట్‌చాట్ పేరుతో నాపైన, ఇతరులపైన విషయం చిమ్మడం ఇదే మొదటిసారి కాదు. కేవలం ముఖ్యమంత్రి కార్యాలయానికి గౌరవం ఇచ్చి ఇప్పటివరకు సంయమనం పాటించాను అని కేటీఆర్ తెలిపారు.డ్రగ్స్ కేసులో నాపై విచారణ జరుగుతుందని రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలకి ఆధారం ఏమిటో

-మిగతా 3 లో

# బీఆర్ఎస్ వాళ్లు బీసీ ఆర్డినెన్స్‌పై మొహం చాటేశారు

- బీసీ ఆర్డినెన్స్‌పై కవిత సంచలన వ్యాఖ్యలు



- ఇది ముమ్మాటికీ ఆమోదయోగ్యమేనని ప్రకటన
- న్యాయనిపుణలుతో చర్చించే వ్యాఖ్యానిస్తున్నట్లు వెల్లడి
- తీన్మార్ మల్లన్న విమర్శలను ఖండించకపోవడంపై ఆగ్రహం


హైదరాబాద్

బీఆర్ఎస్ పార్టీకి ఎమ్మెల్సీ కవిత ఊహించని షాక్ ఇచ్చారు. ఇంటిపార్టీపై కవిత సంచలన వ్యాఖ్యలు చేశారు. బీసీ రిజర్వేషన్ల కోసం ప్రభుత్వం తీసుకొచ్చిన ఆర్డినెన్స్ కరెక్టే అని.. బీఆర్ఎస్ వాళ్ళు ఆర్డినెన్స్ వద్దని చెప్తున్నారు.. అది తప్పు అని కీలక వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్ వాళ్ళు మెల్లగా తన దారికి రావాల్సిందే అని చెప్పారు. తాను న్యాయపరంగా అందరినీ సంప్రదించే కాంగ్రెస్ తెచ్చిన ఆర్డినెన్స్‌ను సమర్థిస్తున్నానని చెప్పుకొచ్చారు. ఇందుకోసం వారు నాలుగు రోజులు

-మిగతా 3 లో

### నిమిష ప్రియ మరణశిక్షపై స్పందించిన

# భారతీయ విదేశాంగ శాఖ



**న్యూఢిల్లీ-ప్రజా స్వేచ్ఛ**

కేరళ నర్సు నిమిష ప్రియ కు చెందిన కేసు చాలా సున్నితమైన అంశం అని, మరణశిక్షను తప్పించేందుకు ప్రభుత్వం వీలైనంత సాయం చేస్తోందని కేంద్ర విదేశాంగ ఇవాళ పేర్కొన్నది. యెమెన్ దేశస్థుడిని హత్య చేసిన కేసులో ఆ దేశం ఆమెకు మరణశిక్ష విధించిన విషయం తెలిసిందే. వాస్తవానికి ఈనెల 16వ తేదీన నిమిష ప్రియను ఉరితీయాల్సి ఉంది. కానీ ఆ నిర్ణయాన్ని యెమెన్ దేశం వాయిదా వేసింది. ఈ నేపథ్యంలో ఇవాళ భారత విదేశాంగ శాఖ స్పందిస్తూ.. నిమిష ప్రియ కేసు కోసం కొన్ని స్నేహపూర్వక దేశాలతో టచ్‌లో ఉన్నట్లు తెలిపింది. చాలా క్లోజ్‌గా ఆ అంశాన్ని ఫాలో అవుతున్నామని, అన్ని రకాల సాయాన్ని అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉన్నట్లు విదేశాంగ శాఖ తెలిపింది. ఈ సమస్యను పరిష్కరించేందుకు స్థాకి అధికారులతో నిత్యం టచ్‌లో ఉన్నట్లు విదేశాంగ శాఖ వెల్లడించింది.తలాల్ అబ్దో మెహదీని 2017లో హత్యచేసిన భారతీయ నర్సు నిమిష ప్రియకు క్షమాభిక్ష ప్రసాదించాలని లేదా నష్టపరిహారం తీసుకోవాలని(బ్లడ్ మనీ) వస్తున్న ప్రతిపాదనలను తమ కుటుంబం అంగీకరించే ప్రసక్తి లేదని బాధిత సోదరుడు అబ్దెల్ ఫత్తా మెహదీ స్పష్టం చేశారు. షరియా చట్టం ప్రకారం ప్రతీకార న్యాయం(కిసాస్) కావాలన్న తమ డిమాండును ఆయన మరోసారి పునరుద్ఘాటించారు. చేసిన నేరానికి నిమిషను ఉరితీయాల్సిందేనని ఆయన స్పష్టం చేశారు.

## ఎనిమిదోసారి క్లీన్ సిటీగా నిలిచిన ఇండోర్..

### -స్వచ్ఛ సర్వేక్షన్ అవార్డు అందజేసిన రాష్ట్రపతి ముర్ము



**న్యూఢిల్లీ ప్రజా స్వేచ్ఛ**

దేశంలోనే అత్యంత స్వచ్ఛమైన నగరంగా మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని ఇండోర్ నగరం మరోసారి మొదటి స్థానంలో నిలిచింది. స్వచ్ఛ నగరాల జాబితాలో ఇండోర్ తొలి స్థానాన్ని కైవసం చేసుకుంది. ఇలా ఈ నగరం మొదటి స్థానంలో నిలవడం ఇది ఎనిమిదోసారి కావడం విశేషం. ఈ నేపథ్యంలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆ నగరానికి స్వచ్ఛ సర్వేక్షన్ అవార్డును అందజేశారు. ఇక రెండో స్వచ్ఛమైన నగరంగా సూరత్, మూడో స్థానంలో ముంబై మహా నగరం నిలిచింది.కేంద్ర ప్రభుత్వం వివిధ కేటగిరీల్లో 'స్వచ్ఛ సర్వేక్షణ్' అవార్డులు ఇటీవలే ప్రకటించిన విషయం తెలిసిందే. స్వచ్ఛ సర్వేక్షణ్ 2024 -25 అవార్డులను రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఇవాళ ప్రదానం చేశారు. ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో జరిగిన వేడుకల్లో 'స్వచ్ఛ' జాబితాలో నిలిచిన నగరాలకు అవార్డులను ప్రదానం చేశారు. కేంద్రం ప్రకటించిన ఈ స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డుల్లో ఏపీలోని ఐదు నగరాలకు చోటు దక్కింది. విశాఖపట్నం జాతీయస్థాయిలో స్పెషల్ కేటగిరీ మినిస్టీరియల్ అవార్డు దక్కించుకుంది. రాజమహేంద్రవరానికి రాష్ట్రస్థాయిలో మినిస్టీరియల్ అవార్డు లభించింది. స్వచ్ఛ సూపర్‌లీగ్ సిటీస్ విభాగంలో విజయవాడ, తిరుపతి, గుంటూరు ఎంపికయ్యాయి.

## రోహ్‌తక్‌లో భూకంపం..

### -రిక్టర్ స్కేల్‌పై 3.3 తీవ్రతతో ప్రకంపనలు



**న్యూఢిల్లీ -ప్రజా స్వేచ్ఛ**

రోహ్‌తక్‌లో గురువారం తెల్లవారు జామున రిక్టర్ స్కేల్‌లో 3.3 తీవ్రతతో భూకంపం సంభవించింది. రోహ్‌తక్ నగరానికి తూర్పున 17 కిలోమీటర్ల దూరంలో భూమి ఉపరితలం నుంచి 10 కిలోమీటర్ల లోతులో భూకంప కేంద్రం గుర్తించినట్లు నేషనల్ సెంటర్ ఫర్ సీస్మోలజీ తెలిపింది. వేకువ జామున భూకంపం సంభవించడంతో జనం ఇండ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. అయితే, భూకంపంతో నష్టం జరిగినట్లు ఎలాంటి సమాచారం అందలేదని అధికారులు పేర్కొన్నారు. ఇదిలా ఉండగా గత ఎనిమిది రోజుల్లో హర్యానాలో నాలుగోసారి భూకంపం సంభవించింది. ఈ నెల 11న, ఝజ్జర్ జిల్లాలో 3.7 తీవ్రతతో భూ ప్రకంపనలు వచ్చాయి. ఆ తర్వాత కొన్ని గంటల తర్వాత అదే ప్రాంతంలో 4.4 తీవ్రతతో మళ్లీ ప్రకంపనలు నమోదయ్యాయి. ఢిల్లీ ఎన్‌సీఆర్ వ్యాప్తంగా భూమి కంపించింది. జులై 10న రోహ్‌తక్ ప్రాంతంలో 2.5 తీవ్రత కంటే ఎక్కువగానే భూప్రకంపనలు వస్తున్నాయని గణాంకాలు పేర్కొంటున్నాయి.


## సత్యజిత్ రే పూర్వీకుల ఇంటి విషయంలో వెనక్కి తగ్గిన బంగ్లాదేశ్..!



**న్యూఢిల్లీ-ప్రజా స్వేచ్ఛ**

ప్రముఖ చలనచిత్ర దర్శకుడు సత్యజిత్ రే పూర్వీకుల ఇంటి కూల్చివేతను బంగ్లాదేశ్ ప్రభుత్వం నిలిపివేసింది. మైమెన్‌సింగ్‌లో ఉన్న ఆ ఇంటిని రెనొవేషన్ కోసం కమిటీని ఏర్పాటు చేసింది. భారత ప్రభుత్వం ఆయన ఇంటిని కూల్చివేయొద్దని.. ఈ విషయంలో పునరాలోచన చేయాలని కోరింది. ఈ క్రమంలో బంగ్లాదేశ్ ప్రభుత్వం నిర్ణయాన్ని మార్చుకున్నది. బెంగాల్ సీఎం మమతా బెనర్జీ సైతం సత్యజిత్ రే ఇంటి కూల్చివేతను ఖండించారు. ఈ ఇంట్లో సత్యజిత్ రే తాత ఉపేంద్ర కిశోర్ రే చాలాకాలం నివసించారు. ఉపేంద్ర కిశోర్ రే ప్రముఖ సాహిత్యకారుడు.ఇటీవల బంగ్లాదేశ్ ప్రభుత్వం సత్యజిత్ రే పూర్వీకుల ఇంటిని కూల్చబోతున్నట్లుగా వార్తలు వచ్చాయి. దీనిపై భారత విదేశాంగ మంత్రిత్వశాఖ ఆందోళన వ్యక్తం చేసింది. ప్రభుత్వం నిర్ణయం గురించి విని చాలా బాధపడ్డామని.. ఈ ఆస్తి బంగ్లాదేశ్ ప్రభుత్వానికి చెందింది. ప్రస్తుతం చాలా దారుణమైన స్థితిలో ఉంది. బెంగాలీ సాంస్కృతిక పునరుజ్జీవానికి చిహ్నంగా ఉంది. ఈ భవనం ప్రాముఖ్యతను దృష్టిలో పెట్టుకొని కూల్చివేతపై పునరాలోచన చేయాలి. ఈ విషయంలో అవసరమైన సహాయం చేసేందుకు భారత ప్రభుత్వం సిద్ధం ఉంది' అని పేర్కొంది. బెంగాల్ సీఎం మమతా బెనర్జీ సైతం ఈ వారసత్వ కట్టడాన్ని కాపాడుకునేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయంపై శ్రద్ధ వహించాలని కేంద్రానికి సూచించారు.

## ఉక్రెయిన్ నూతన ప్రధానిగా యూలియా స్వైరైదెకో నియామకం



**న్యూఢిల్లీ -ప్రజా స్వేచ్ఛ**

ఉక్రెయిన్ నూతన ప్రధాన మంత్రి గా యూలియా స్వైరైదెకో నియమితులయ్యారు. అంతకు ముందు ప్రధానిగా ఉన్న డెనిస్ ష్మిహాల్ మంగళవారం తన పదవికి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. మార్చి 4, 2020న ప్రధాని బాధ్యతలు స్వీకరించిన డెనిస్ దాదాపు ఐదేళ్లకు పైగానే ఆ పదవిలో కొనసాగారు. అయితే, అధ్యక్షుడు జెలెన్ స్కీ ప్రభుత్వంలో గణనీయమైన భారీ పునర్వ్యవస్థీకరణ చేపడుతున్నారు ఇందులో భాగంగానే డెనిస్ ప్రధాని పదవికి రాజీనామా చేసినట్లు తెలిసింది. ఆయన తన రాజీనామా లేఖను అధ్యక్షుడికి పంపారు. ఆయన రాజీనామాతో ప్రస్తుతం ఉక్రెయిన్ ఉప ప్రధానిగా, మహిళా ఆర్థికమంత్రిగా ఉన్న యూలియా స్వైరైదెకోను ప్రధానిగా జెలెన్‌స్కీ ప్రతిపాదించారు. ఇప్పుడు ఆమెను అధికారికంగా ప్రకటించారు. యూలియా.. జెలెన్‌స్కీకి సన్నిహితురాలు. సుదీర్ఘకాలం నుంచి మంచి మిత్రురాలు కూడా. ఆమె అమెరికా, ఉక్రెయిన్ ఖనిజ ఒప్పందం చర్చల్లో కీలకపాత్ర పోషించారు. అంతేకాదు పశ్చిమ దేశాల మిత్రులతో జరిగిన పలు ఉన్నతస్థాయి చర్చల్లోనూ ఈమె చురుగ్గా వ్యవహరించారు.

## నెతన్యాహుకు పదవీ గండం?



**టెల్ అవీవ్ -ప్రజా స్వేచ్ఛ**

ప్రధాన మంత్రి బెంజమిన్ నెతన్యాహు నేతృత్వంలోని ఇజ్రాయెల్ సంకీర్ణ ప్రభుత్వానికి పెద్ద దెబ్బ తగిలింది. ఈ కూటమిలోని కీలక మిత్ర పక్షం షాస్ పార్టీ తన మద్దతును ఉపసంహరించింది. దీంతో ఆయన ప్రభుత్వం మైనారిటీలో పడింది.మతపరమైన సెమినరీలలో చదువుకునేవారికి మ్యాండేటరీ మిలిటరీ సర్వీస్ నుంచి మినహాయించే అవకాశం లేకుండా రూపొందించిన ముసాయిదా బిల్లును వ్యతిరేకిస్తూ షాస్ పార్టీ ఈ నిర్ణయం తీసుకుంది. వీరికి సైన్యం నుంచి మినహాయింపునివ్వడం రాజ్యాంగ విరుద్ధమని సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది.

## మరో ఇండిగో విమానంలో సాంకేతిక సమస్య



**న్యూఢిల్లీ ప్రజా స్వేచ్ఛ**

విమానాల్లో సాంకేతిక సమస్యలు ఆందోళన కలిగిస్తున్నాయి. గత నెల అహ్మదాబాద్‌లో జరిగిన ఘోర విమాన ప్రమాదం తర్వాత ఒకదాని తర్వాత ఒక విమానంలో ఇలాంటి సమస్యలు బయటపడుతున్నాయి. దీంతో ప్రయాణికులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. నిన్న ఓ ఇండిగో విమానంలో సాంకేతిక సమస్య తలెత్తిన విషయం తెలిసిందే. తాజాగా మరో ఫ్లైట్‌లో కూడా ఇలాంటి సమస్యే ఉత్పన్నమైంది.ఇండిగో 6E5118 విమానం ఢిల్లీ నుంచి ఇంఫాల్ బయల్దేరింది. విమానం ఢిల్లీ ఎయిర్‌పోర్ట్ నుంచి టేకాఫ్ అయిన కొద్దిసేపటికే సాంకేతిక సమస్యలు తలెత్తాయి. దీంతో అప్రమత్తమైన పైలట్ ముందు జాగ్రత్త చర్యగా విమానాన్ని వెనక్కి మళ్లించారు. గాల్లోకి ఎగిరిన కాసేపటికే విమానం తిరిగి ఢిల్లీ ఎయిర్‌పోర్ట్‌లో సురక్షితంగా ల్యాండ్ అయ్యింది. ఈ విషయాన్ని ఇండిగో సంస్థ కూడా ధృవీకరించింది. సమస్యను పరిష్కరించిన తర్వాత విమానం తిరిగి ఇంఫాల్ బయల్దేరి వెళ్లినట్లు తెలిపింది.

# 150 దేశాల పై 10 లేదా 15 శాతం సుంకాలు



**వాషింగ్టన్ ప్రజా స్వేచ్ఛ**

ప్రతీకార సుంకాలతో ప్రపంచ దేశాలపై విరుచుకుపడుతున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి సంచలన నిర్ణయం తీసుకున్నారు. 150కిపైగా దేశాలపై 10 లేదా 15 శాతం సుంకాలు విధించనున్నట్లు ప్రకటించారు. ఈమేరకు ఆయా దేశాలకు సుంకాల రేట్లు తెలియజేస్తూ లేఖలు పంపనున్నట్లు వెల్లడించారు. 150కిపైగా దేశాలకు నోటీసులు పంపించనున్నామని, అందులోనే సుంకం రేటు పేర్కొంటామని చెప్పారు. ఈ దేశాలన్నింటికీ ఒకే విధంగా సుంకాలు ఉంటాయని వ్యాఖ్యానించారు. అవన్నీ పెద్ద దేశాలు కాదని, తమతో అంతగా వ్యాపారం చేయవని పేర్కొన్నారు. ఈ సుంకాలు 10 లేదా 15 శాతం ఉంటే అవకాశం ఉందని చెప్పారు.మరోవైపు రష్యాతో వాణిజ్యం దేశాలపై 500 శాతం సుంకాలు విధిస్తామని అమెరికా ప్రకటించిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా ఓ బిల్లును కూడా తీసుకురానున్నట్లు రిపబ్లికన్ సెనేటర్ లిండ్సే గ్రాహం ఇటీవల తెలిపారు. ఇదేవిధమైన ప్రకటన నాటో సెక్రటరీ జనరల్ మార్క్ రూట్ చేశారు. రష్యాతో వ్యాపారం కొనసాగించే దేశాలు ఆర్థికపరమైన ఆంక్షలను ఎదుర్కోవలసి వస్తుందని భారత్, చైనా, బ్రెజిల్‌ని హెచ్చరించారు. రష్యా నుంచి చమురు, సహజ వాయువు దిగుమతి చేసుకుంటున్న దేశాలపై అదనంగా 100 శాతం ఆంక్షలు విధిస్తామని ఆయన హెచ్చరించారు. 'మీరు భారత ప్రధాని అయినా, చైనా అధ్యక్షుడు అయినా లేక బ్రెజిల్ అధ్యక్షుడు అయినా.. రష్యాతో వాణిజ్యం ఇంకా కొనసాగిస్తూ వారి చమురు, గ్యాస్‌ని కొనుగోలు చేస్తుంటే మీపై అదనంగా 100 శాతం ఆంక్షలు విధిస్తాను' అంటూ రూట్ ప్రకటించారు. రష్యా-ఉక్రెయిన్ యుద్ధంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వైఖరి మారిన నేపథ్యంలో నాటో ప్రధాన కార్యదర్శి నుంచి ఈ హెచ్చరికలు జారీకావడం గమనార్హం. ఈ మూడు దేశాల నాయకులు శాంతి చర్చలపై దృష్టి కేంద్రీకరించాలని రష్యా అధ్యక్షుడు పుతిన్‌పై ఒత్తిడి తీసుకురావాలని ఆయన కోరారు. తాను చేస్తున్న హెచ్చరికను ఈ మూడు దేశాల నాయకులు పరిగణనలోకి తీసుకోని పక్షంలో తీవ్రంగా నష్టపోతారని కూడా ఆయన హెచ్చరించారు. శాంతి చర్చలకు కట్టుబడి ఉండాలని పుతిన్‌ని ప్రత్యక్షంగా పిలుపునివ్వాలని మూడు దేశాల నాయకులను ఆయన కోరారు. శాంతి చర్చలను సీరియస్‌గా తీసుకోవాలని పుతిన్‌కి ఫోన్ చేసి నేరుగా చెప్పాలని ఆయన తెలిపారు. అలా చేయకపోతే భారత్, బ్రెజిల్, చైనా భారీస్థాయిలో దెబ్బ తింటాయని ఆయన చెప్పారు. కాగా, అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కూడా రష్యా నుంచి చమురు దిగుమతి చేసుకుంటున్న దేశాలపై భారీ స్థాయిలో సుంకాలు విధిస్తామని ఇటీవలే ప్రకటించారు. అంతేగాక ఉక్రెయిన్‌తో 50 రోజుల్లో కాల్పుల విరమణ ఒప్పందం చేసుకోకపోతే రష్యా ఎగుమతులపై 100 శాతం సుంకాలు విధిస్తామని కూడా ట్రంప్ హెచ్చరించారు.

# కేసీఆర్ కుటుంబం కడుపునిండా విషమే

(మొదటి తరువాయి)

ముఖ్యంగా బీజేపీ, బీఆర్ఎస్ నేతలపై ఘాటైన పదజాలంతో ప్రస్తావించారు. కేంద్రంతో చర్చలు జరుపకుంటే సమస్యలు ఎలా పరిష్కారం అవుతాయని ప్రశ్నించారు సీఎం. రాష్ట్రానికి సంబంధించి పలు ముఖ్యమైన అంశాలను ఢిల్లీలో కేంద్ర మంత్రులతో చర్చించామని తెలిపారు. ఇండియా, పాకిస్తాన్ మధ్యే నీటి పంపిణీపై చర్చలు జరుగుతుంటే, నేను పక్క రాష్ట్రం సీఎంతో మాట్లాడితే తప్పేంటని ఆయన ప్రశ్నించారు. తుమ్మిడిహట్టి ప్రాజెక్టు కోసం మహారాష్ట్రలో పర్యటిస్తానని సీఎం తెలిపారు. రెండున్నరేళ్లలో లక్ష ఉద్యోగాలు ఇచ్చి తీరుతామన్నారు. బతుకమ్మ చీరలు, కేసీఆర్ కిట్ తప్ప పాత పథకాలన్నీ అమల్లోనే ఉన్నాయని చెప్పారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి లేఖలు రాయడం కాదని.. ప్రణాళికతో ముందుకు రావాలని సూచించారు. ఆయనతో కలిసి పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు రేవంత్ తెలిపారు. నదుల అనుసంధానం కోసం కేంద్రం ప్రయత్నిస్తోంది. ఇచ్చంపల్లి నుంచి కావేరికి అనుసంధా నించాలనే ప్రతిపాదన ఉంది. ప్రతిపక్షనేత పదవి ఇవ్వాలని కేసీఆర్‌ను కేటీఆర్ అడుగుతున్నారు. దానికి కేసీఆర్ అంగీకరించడం లేదు. సొంత వివాదాలతోనే ఆ కుటుంబానికి సరిపోతోంది. కేటీఆర్ నాయకత్వాన్ని కవిత ఒప్పుకోవడం లేదు. కేంద్రం పిలిచినప్పుడు వెళ్లకుండా.. కేసీఆర్ ఫాంహౌస్‌కు వెళ్లాలా?అక్కడికి వెళ్తే సమస్యలు ఎలా పరిష్కారమవుతాయి?హైదరాబాద్‌లో లోకేశ్‌ని కేటీఆర్ చీకట్లో ఎందుకు కలిశారు? కేదార్ అనే వ్యక్తితో కలిసి కేటీఆర్ దుబాయ్‌లో డ్రగ్స్ తీసుకున్నారు. డ్రగ్స్ కలగలిపి తీసుకోవడం వల్లే కేదార్ మరణించాడు. ఆయన మరణంపై పూర్తినివేదిక ఉంది. మద్యంలో కాక్టెయిల్ విన్నాం.. డ్రగ్స్‌లో తొలిసారి కాక్‌టెయిల్ అని వింటు-న్నాం. అవసరమైనప్పుడు కేదార్ మరణానికి గల కారణాల రిపోర్టును బయటపెడతాం. ఆ రిపోర్టును అసెంబ్లీలో పెట్టడానికీ సిద్ధమే. నేను చర్చిస్తానంటోంది ప్రతిపక్ష నేత కేసీఆర్‌తో మాత్రమే.. కేటీఆర్‌తో కాదని స్పష్టం చేశారు. ఢిల్లీకి వెళ్లడం నేరంగా మాట్లాడుతున్నారు.. కేంద్రానికి సంబంధించిన అంశాలపై కేంద్రంతోనే మాట్లాడాలన్నారు. ఢిల్లీకి వెళ్లకుండా ఎక్కడికి వెళ్లాలి.. ఫామ్ హౌస్ కి వెళ్ళాలా? అని ఫైర్ అయ్యారు. 33, 34 సార్లు ఢిల్లీకి వచ్చానని.. 48 సార్లు వచ్చానని మాట్లాడుతున్నారన్నారు. తన ప్రియారిటి రాష్ట్రమని.. వ్యూహాత్మకంగా వ్యవహరిస్తూ , వివాదాలను పరిష్కరించుకోవడం ముఖ్యమన్నారు. వ్యూహంతో పని చేస్తున్నామని.. గత ప్రభుత్వం సాధించనివి ఎన్నో.. తాను సాధించానన్నారు. ఢిల్లీలో కేంద్రం ఉన్నప్పుడు, ఇక్కడికి వచ్చే రాష్ట్రం కోసం మాట్లాడాలన్నారు. తాను ఎవరికైనా భయపడితే రేవంత్ రెడ్డిని కాదని ఫైర్ అయ్యారు.. రాష్ట్ర అవసరాల కోసం ఢిల్లీతోపాటు, అవసరమైతే రాష్ట్రాలకు కూడా వెళ్లాల్సి ఉంటుందన్నారు. త్వరలోనే మహారాష్ట్రకు వెళ్తామని.. నీటి ప్రాజెక్టులకు సంబంధించిన అంశాలపై అక్కడ మాట్లాడుతామన్నారు.బనకచర్ల ప్రాజెక్టుపై కేంద్ర జలశక్తి శాఖ ఎలాంటి చర్చలు జరగలేదని ప్రకటించిందని సీఎం తెలిపారు. అయితే, తాను ఇప్పటికే మూడు సమస్యలను పరిష్కరిం చానని పేర్కొన్నారు. మిగిలిన సమస్యలపై అధికారులు, సాంకేతిక నిపుణుల కమిటీ- చర్చిస్తుందని వివరించారు. నేను ఇంజనీర్ కాదు... సాంకేతిక అధ్యయనం తర్వాతే నిర్ణయం తీసుకుంటాం అని పేర్కొన్నారు. ప్రజలు నాకు అధికారం ఇచ్చారు.. రాష్ట్ర సమస్యలను కేంద్రానికి తీసుకెళ్లడం నా బాధ్యతని సీఎం స్పష్టం చేశారు. ఢిల్లీకి కాకుండా ఫామ్ హౌస్‌కు వెళ్తే సమస్యలు పరిష్కారం కావు అని పరోక్షంగా కేసీఆర్‌పై విమర్శలు చేశారు. నెలకు ఖచ్చితంగా రెండు సార్లు ఢిల్లీకి వెళ్లి కేంద్ర మంత్రులతో సమన్వయం చేసుకుంటానని హామీ ఇచ్చారు.ప్రతిపక్ష నేత కేసీఆర్‌తో అసెంబ్లీలో చర్చకు తాను సిద్ధమని స్పష్టం చేశారు. కేటీఆర్ నాయకత్వాన్ని చెల్లెలే అంగీకరించడం లేదు. గతంలో సవాల్ విసిరితే పారిపోయారని అంటూ తీవ్ర విమర్శలు చేశారు. గంజాయి బ్యాచ్‌కి నేను భయపడను. భయపడి ఉంటే నేను రేవంత్ రెడ్డి అవుతానా? అంటూ విరుచుకుపడ్డారు. బీసీ రిజర్వేషన్లపై మా వ్యూహం మాకుందని, కేటీఆర్ డ్రగ్స్ కేసుపై, గత ప్రభుత్వ అవినీతిపై విచారణ జరుగుతుందన్నారు. విలన్లు క్లైమాక్స్ లోనే అరెస్ట్ అవుతారని, కేటీఆర్ లోకేష్ ల మీటింగ్ సంగతేంటని ఆయన ప్రశ్నించారు. కిషన్ రెడ్డికి బీసీ రిజర్వేషన్లపై సవాల్ విసిరిన రేవంత్.. ఫోన్ ట్యాపింగ్ పై కీలక వ్యాఖ్యలు చేశారు. కేంద్రంతో కలిసి పని చేస్తామని, కేసీఆర్ సభకు రావాలన్నారు. తనపై ఉన్న కేసులపై హడావుడి చేయడం లేదని, చట్టం తన పని తాను చేసుకుంటుందన్నారు. నేను హడావుడి చేస్తే మళ్లీ మీడియానే ప్రశ్నిస్తుంది అంటూ వ్యాఖ్యానించారు. బీజేపీ సీబీఐ కేసుల పేరుతో రాజకీయాలు చేయాలని చూస్తోందని ఆరోపించారు. రెండేళ్ల తర్వాత కార్పొరేషన్ నామినే-టె-డ్ పోస్టులను మళ్లీ భర్తీ చేస్తామని సీఎం ప్రకటించారు. గత ప్రభుత్వ అవినీతిపై విచారణ జరుగుతుంది. విలన్లు ఎప్పుడైనా క్లైమాక్స్ లోనే అరెస్ట్ అవుతారు. కాళేశ్వరం, ఫోన్ టాపింగ్, హెచ్‌ఎండిఏ ఎన్నో కేసులో విచారణ జరుగుతుంది. ఫోన్ టాపింగ్ కేస్ హైకోర్టు పర్యవేక్షణలో జరుగుతుంది. కేసుల వివరాలను ఎప్పటికప్పుడు హైకోర్టుకు వివరిస్తున్నాం. ప్రభాకర్ రావు ఇండియాకు ఆలస్యంగా రావడానికి కారణం కేంద్ర ప్రభుత్వమే.. కేంద్రం ఎందుకు ప్రభాకర్ రావును తీసుకురాలేదని సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు.

## బలూచి లిబరేషన్ దాడులు

(మొదటి తరువాయి)

పలువురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ బస్సు కరాచీ నుంచి క్వెట్టాకు దళాలను తరలిస్తుండగా ఈ దాడి చోటు-చేసుకొంది. మరో ఘటనలో క్వెట్టాలోని హజార్‌గంజ్‌లో ఐఈడీ పేల్చి మరో ఇద్దరు సైనికులను హతమార్చినట్లు బీఎల్‌ఏ వెల్లడించింది. మంగళవారం కలాత్‌లోని ఖజినా ప్రాంతంలో మరో ఐఈడీ పేల్చి నలుగురు సైనికులను , బుధవారం గుజ్రోకొర్ ఏరియాలో దాడి చేసి మరో ఆరుగురు సైనికులను హత్య చేసినట్లు- బీఎల్‌ఏ ప్రకటించింది. వీరిలో మేజర్ సయిద్ రబ్ నవాజ్ తరీక్ కూడా ఉన్నట్లు- చెప్పింది. సమీపంలోని సైనిక కాన్వాయ్‌ను స్నైపర్లు లక్ష్యంగా చేసుకోవడంతో.. ఆ కాన్వాయ్ అక్కడినుంచి వెళ్లిపోయింది. ఇక ముగ్గురు బీఎల్‌ఏ దళ సభ్యులు చనిపోయినట్లు- వచ్చిన వార్తలను ఖండించింది. ఈ ఏడాది జనవరి నుంచి జూన్ బలోచ్ రెబల్స్ మొత్తం 286 దాడులు చేశారు. ఈ క్రమంలో వివిధరకాల వ్యూహాలను అమల్లోకి తెచ్చారు. వీటిల్లో మూడు ఆత్మాహుతి దాడులు ఉన్నాయి. బీఎల్‌ఏ చేసిన మొత్తం దాడుల్లో 700 మందికి పైగా చనిపోయారు. 290 మందిని అదుపులోకి తీసుకొన్నట్లు- బీఎల్‌ఏ చెబుతోంది. ఈ క్రమంలో 133 వాహనాలను లక్ష్యంగా చేసుకొంది. ఏకంగా ఓ రైలునే హైజాక్ చేసింది. దీంతోపాటు- ఈ ఏడాది మొత్తం 45 వ్యూహాత్మక ప్రాంతాలను పాక్ నుంచి స్వాధీనం చేసుకొన్నట్లు- గణాంకాలు చెబుతున్నాయి.

## ఉనికి చాటుకునేందుకు హరీష్ యత్నం

(మొదటి తరువాయి)

ఘాటుగా స్పందించారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. మీటింగ్‌లో ఏయే అంశాలు మాట్లాడారో సీఎం రేవంత్ రెడ్డి ప్రెస్‌మీట్ పెట్టి చెప్పినా కూడా హరీష్ రావు మెదడుకు ఎక్కనట్టు ఉంది అంటూ సెటైర్ విసిరారు. హరీష్ అడ్డగోలు వాదనతో, అర్థం లేని తర్కంతో పిచ్చి ప్రేలాపనలు చేస్తున్నారంటూ మండిపడ్డారు. సీఎం మాట్లాడగానే ఏదో ఒకటి మాట్లాడి తన ఉనికిని చాటు కోవాలన్న తపన తప్ప హరీష్ రావుకు రాష్ట్ర ప్రయోజనాలు ముఖ్యం కాదన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి హోదాలో మాజీ సీఎం, బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కేసీఆర్‌కు సవాల్ విసిరారన్నారు. అసెంబ్లీకి వచ్చి చర్చల్లో పాల్గొనండి లేదా తామే ఫామ్ హౌస్‌కు వచ్చి అక్కడ మాక్ అసెంబ్లీ పెడుతాము పాల్గొనండి అని సవాల్ చేస్తే అక్కడ నుంచి నోరు లేవలేదన్నారు. మళ్ళీ సిగ్గు లేకుండా సవాళ్ల గురించి మాట్లాడుతున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆంధ్ర ప్రాజెక్టులు కట్టుకున్నా సమస్య లేదు. రాయలసీమను రతనాల సీమ చేస్తాను. బెసిన్లు లేవు, భేషజాలు లేవు అని కేసీఆర్ అంటేనే కదా ఈరోజు వాళ్ళు బనకచర్ల, రాయలసీమ ఎత్తిపోతల పథకాలు కడుతున్నది. తెలంగాణకు ద్రోహం చేసి మళ్లీ మీరే సిగ్గులేకుండా కాంగ్రెస్ మీద, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిపై ఆరోపణలు చేస్తున్నారు. మీకు దమ్ముంటే అసెంబ్లీలో పెట్టే చర్చలకు నువ్వు, మీ మామ కేసీఆర్ వచ్చి మీ వాదన చెప్పండని సవాల్ చేశారు. అప్పుడు ఎవరు ఏంటో తెలుస్తుందని అన్నారు. ప్రెస్‌మీట్‌లు పెట్టి కోడిగుడ్డు మీద ఈకలు పీకుదామని చూస్తే జనం నమ్మరంటూ పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ వ్యాఖ్యలు చేశారు. ఇలాంటి వాదనలు కట్టిపెట్టాలని అన్నారు. బిఆర్ఎస్ నేతలు తమ అవినీతిని కప్పిపుచ్చుకునేందుకు ఇలాంటి పసలేని వాదనలు చేస్తున్నారని మహేశ్ కుమార్ అన్నారు.

## బీహార్‌లో నితీష్ ఉచిత వల

(మొదటి తరువాయి)

రాష్ట్ర ప్రభుత్వం భరిస్తుందని, మిగిలిన వారికి ప్రభుత్వం తగిన మద్దతును అందిస్తుందని తెలిపారు. అంటే గృహ వినియోగదారులు ఇకపై 125 యూనిట్ల వరకు విద్యుత్ కోసం ఎటు-వంటి ఖర్చు భరించాల్సిన అవసరంలేదని, రాబోయే మూడేళ్లలో రాష్ట్రంలో 10,000 మెగావాట్ల వరకు సౌరశక్తి అందుబాటు-లో ఉంటుందని అన్నారు. తాము అధికారంలోకి వస్తే 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇస్తామని రాష్ట్రీయ జనతాదళ్ (ఆర్‌జెడి) నేత, మాజీ డిప్యూటీ- సిఎం తేజస్వీయాదవ్ ప్రకటించిన సంగతి తెలిసిందే. తమ నేత 200 యూనిట్ల వరకు విద్యుత్ ఉచితమని ప్రకటించడంతో బీహార్ సిఎం నితీష్‌కుమార్ దిగిరావాల్సి వచ్చిందని ఆర్‌జెడి అధికార ప్రతినిధి శక్తి సింగ్ యాదవ్ ఏద్దేవా చేశారు.

## కేంద్ర మంత్రి బండికి సిట్ నోటీసులు

(మొదటి తరువాయి)

వ్యూ గెస్ట్ హౌజ్ లో స్టేట్ మెంట్ ఇచ్చేందుకు బండి సంజయ్ అంగీకరించారు. అదేరోజు పీఆర్వో మధు, పీఏ ప్రవీణ్ ల స్టేట్ మెంట్‌ను రికార్డ్ చేయనున్నారు. గురువారం కేంద్ర మంత్రి నివాసానికి వచ్చిన సిట్ అధికారులు నోటీసులందించారు. కొద్దిరోజుల క్రితమే బండి సంజయ్ వ్యక్తిగత డ్రైవర్ రమేశ్ ను పిలిచి స్టేట్ మెంట్ రికార్డు చేశారు. కాగా.. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో వివిధ పార్టీలకు చెందిన ఫోన్లను గత ప్రభుత్వం ట్యాపింగ్ చేసిందనే ఆరోపణలు ఉన్నాయి. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు చెందిన ముఖ్య నేతల ఫోన్లను ట్యాపింగ్ చేసినట్లు ఆరోపణలు రావడంతో సిట్ పలువురు నేతలను పిలిచి వాంగ్మూలం తీసుకుంటోంది. తాజా బండి సంజయ్ స్టేట్‌మెంట్‌ను కూడా రికార్టు చేయనుంది. గురువారం ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న స్టేట్‌మెంట్‌ను రికార్డు చేశారు.


## ఉపాధి హామీ లో దక్షిణాదిలో ఏపీ ఆదర్శం

(మొదటి తరువాయి)



ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ- సీఎం పవన్ కళ్యాణ్ నేతృత్వంలోని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గ్రామీణ అభివృద్ధిని ప్రధాన లక్ష్యంగా తీసుకొని ప్రతి ఒక్కరికి ఉపాధి కల్పించాలనే సంకల్పంతో ముందుకెళ్తున్నాయని వెల్లడించారు. ఇక, ఉపాధి ద్వారా చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు విజయవంతంగా అమలవుతుండటంతో, రాష్ట్రంలోని గ్రామాల రూపురేఖలు మారుతున్నాయని డిప్యూటీ- సీఎం పవన్ కళ్యాణ్ చెప్పుకొచ్చారు. అధికారుల పని తీరును ఎప్పటికప్పుడు సోషల్ ఆడిట్ ద్వారా సమీక్షిస్తూ, నాణ్యతా తనిఖీలు, పారదర్శకత, జవాబుదారీతనాన్ని పాటించడం వల్ల ఇతర రాష్ట్రాల అధికారులు కూడా ఆంధ్రప్రదేశ్ పని తీరును మెచ్చుకుంటు-న్నారని పవన్ కళ్యాణ్ ఎక్స్ వేదికగా రాసుకొచ్చారు.

## రష్యాతో ఇంధన ఒప్పందం చేసుకుంటాం



(మొదటి తరువాయి)

గమినిస్తున్నాం. అయితే.. నేను మరోసారి చెబుతున్నా మా దేశ ప్రజల ఇంధన అవసరాలే మాకు తొలి ప్రధాన్యం. అందుకని ప్రపంచ పరిస్థితులను బట్టి మార్కెట్లో అందుబాటులో ఉన్న వనరులను ఎంచుకుంటాం. ఈ విషయంలో ద్వంద్వ ప్రమాణాలు పాటించడం సరికాదని హెచ్చరిస్తున్నాం' అని జైస్వాల్ తెలిపారు. ఉక్రెయిన్‌తో రష్యా శాంతి చర్చలకు సిద్ధం కాకుంటే ఆ దేశ ప్రధాన వ్యాపార భాగస్వాములైన భారత్, బ్రెజిల్ చైనాలపై ట్రేడ్ టారిఫ్స్ తప్పవని నాటో చీఫ్ మార్క్ రుట్టే హెచ్చరించారు. అమెరికా సెనేటర్లతో సమావేశమైన తర్వాత ఆయన ఆంక్షల ప్రకటన చేయడం గమనార్హం. జూలై తొలి వారంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సైతం రష్యాతో ఆయిల్ ఒప్పందం చేసుకునే దేశాలపై వంద శాతం సెకండరీ టారిఫ్ భారం తప్పదని వార్నింగ్ ఇచ్చారు. ఉక్రెయిన్‌తో 50 రోజుల్లో శాంతి ఒప్పందం చేసుకోకుంటే తమ ఆగ్రహానికి బలికావాల్సి వస్తుందని ట్రంప్ మాస్కోకు అల్టిమేటం జారీ చేశారు.

## రాష్ట్రంలో శాంతి భద్రతలు లేవు



(మొదటి తరువాయి)

మా కేటీఆర్‌కు లేదు. ఈ రాష్ట్రం కోసం, ప్రజల కోసం మేము భయపడం. ఏదో ఒకటి చేసి మా పైన కేసులు పెడితే మేము భయపడతాం అని రేవంత్ రెడ్డి అనుకుంటు-న్నాడు. మా పై తెలంగాణ ఉద్యమంలో 300 పైగా కేసులు పెట్టారు. ఎన్ని కేసులు పెట్టిన భయపడేది లేదు. మా పైన ఇంటిలిజెన్స్ వ్యవస్థతో రేవంత్ రెడ్డి నిఘా పెడుతున్నాడు, మాకేం కాదు. రేవంత్ రెడ్డి బీఆర్ఎస్ నాయకుల ఫోన్లను రోజూ ట్యాప్ చేస్తున్నాడు. మా వెనుక ఇంటలిజెన్స్ వాళ్ళను పెట్టి ఎక్కడ అంటే అక్కడ తిప్పుతున్నారు. మా చుట్టూ నిఘా పెట్టారు. మా అందరి ఫోన్స్ ట్యాప్ అవుతున్నవి. విలేకరుల ఫోన్ ట్యాప్ చేస్తున్నారా. నా తో విలేకరులు మాట్లాడేది ఎలా తెలుస్తుందని అన్నారు.

## నాపై డ్రగ్స్ కేసు నమోదైందా?

(మొదటి తరువాయి)

చెప్పాలి. నాపైన ఏమైనా కేసు నమోదైందా? కనీసం అణువంత రుజువైనా ఉన్నదా? ముఖ్యమంత్రికి దమ్ముంటే దొంగ చాటుగా చేసిన వ్యాఖ్యలపై ఆధారాలు బయటపెట్టాలని సవాల్ విసురుతున్నాను. లేకుంటే తాను చేసింది చౌకబారు, చిల్లర వ్యాఖ్యలు అని ఒప్పుకోవాలి అని కేటీఆర్ డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లో నాతో ముఖాముఖి చర్చకు వచ్చే దమ్ములేక ఢిల్లీ వరకు ప్రయాణం చేసి మరీ రేవంత్ రెడ్డి నాపై బురద జల్లుతున్నాడు. కేవలం చట్టం పరిధి నుంచి న్యాయస్థానాల పరిధి నుంచి తప్పించుకోవడానికే ముఖ్యమంత్రి చిట్‌చాట్‌ల పేరుతో దొంగచాటు మాటలు మాట్లాడుతున్నాడు. పిరికి దద్దమ్మలా చిట్‌చాట్‌ల పేరుతో నా వ్యక్తిత్వ హననానికి పాల్పడుతున్నాడు. వీటన్నింటినీ ఇకపై సహించేది లేదు.. రేవంత్ రెడ్డి చేసిన అసత్యపూరిత, దురుద్దేశపూర్వక నిందలకు మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుంది. రేవంత్ తాను చేసిన నిరాధార ఆరోపణలకు వెంటనే క్షమాపణ చెప్పాలి. లేదంటే పర్యావసనాలు ఎదుర్కోవాల్సి వస్తుంది అని కేటీఆర్ హెచ్చరించారు.

## బీఆర్ఎస్ వాళ్లు బీసీ ఆర్డినెన్స్‌పై మొహం చాటేశారు

(మొదటి తరువాయి)

టైం తీసుకుంటారేమో అంతే అంటూ ఘాటుగా వ్యాఖ్యానించారు. 2018 చట్ట సవరణ చేసి ఆర్డినెన్స్ తేవడం సబబే అని రేవంత్ సర్కార్ కు బహిరంగ మద్దతును ప్రకటించారు. న్యాయనిపుణులతో చర్చించిన తర్వాతే ఆర్డినెన్స్‌కు తాను మద్దతు ఇస్తునట్లు చెప్పారు. తనపై తీన్మార్ మల్లన్న చేసిన కామెంట్స్ కు బీఆర్ఎస్ పార్టీ రియాక్ట్ కాలేదని.. దానిని వాళ్ల విజ్ఞతకే వదిలేస్తున్నానని అన్నారు. హైదరాబాద్ లోని తన నివాసంలో మీడియా చిట్ చాట్ లో ఎమ్మెల్సీ కవిత ఈ వ్యాఖ్యలు చేశారు. ఇప్పటికే ఎమ్మెల్సీ కవిత, కేటీఆర్ మధ్య దూరం పెరుగుతున్నట్లు కనిపిస్తోంది. అన్నాచెల్లాల మధ్య గ్యాప్ రావడానికి కారణాలు ఏంటి అనేది ఇప్పటికి ఇంకా తెలియరాలేదు. ఇదిలా ఉంటే బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఉన్న కేటీఆర్.. కవితకు షాక్ ఇచ్చారు. తెలంగాణ బొగ్గుగని కార్మిక సంఘం ఇంఛార్జ్‌గా ఉన్న కవిత స్థానంలో మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ నియమించారు. కేటీఆర్ తీసుకున్న ఈ నిర్ణయం గులాబీ పార్టీలో, రాజకీయవర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. కవితకు పార్టీలో, అనుబంధ సంఘాల్లోనూ ప్రాధాన్యం తగ్గుతోందంటూ సామాజిక మాధ్యమాల్లో విస్తృత ప్రచారం జరుగుతోంది. తాజాగా ఎమ్మెల్సీ కవిత.. బీఆర్ఎస్ పార్టీపై చేసిన ఆరోపణలతో ఆ పార్టీకి, ఆమెకు దూరం పెరిగినట్లు కనిపిస్తోంది. అన్నపై ఉన్న కోపంతో కవిత ఈ వ్యాఖ్యలు చేశారనే చర్చ రాష్ట్ర రాజకీయాల్లో జోరందుకుంది. తీన్మార్ మల్లన్న వ్యాఖ్యలపై బిఆర్ఎస్ నేతలు స్పందించకపోవడమనేది దారుణమని ఎంఎల్‌సి కవిత మండిపడ్డారు. ఈ విషయం బిఆర్ఎస్ నేతల విజ్ఞతకే వదిలివేస్తున్నానని, తన దారికి భారత రాష్ట్ర సమితి నేతలు రావాల్సిందేనని స్పష్టం చేశారు. న్యాయ నిపుణులతో చర్చించిన తరువాతనే బిసి రిజర్వేషన్ ఆర్డినెన్స్ ఒక నిర్ణయానికి వచ్చామన్నారు. రెండు బిల్లులు పెట్టాలని తొలుత డిమాండ్ చేసింది కూడా తానేనని తెలియజేశారు. బనకచర్లపై చర్చకు వెళ్లనని సిఎం రేవంత్ రెడ్డి మేకపోతు గాంభీర్యం ప్రదర్శించారని, బుధవారం ఢిల్లీ సమావేశంలో ఎజెండాలో మొదటి అంశమే బనకచర్ల అని పేర్కొన్నారు. బనకచర్లపై చర్చే జరగలేదని రేవంత్ రెడ్డి బుకాయించడం మంచి పద్ధతి కాదని హితువు పలికారు. ఎపి, తెలంగాణ ముఖ్యమంత్రుల మధ్య బనకచర్ల ప్రాజెక్టుపై చర్చలు జరిపారని తెలియజేశారు. బనకచర్ల ప్రాజెక్టు నిర్మిస్తే గోదావరి జలాలు హక్కులు తెలంగాణ రాష్ట్రం కోల్పోతుంద న్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిలు గోదావరి జలాలను ఎపి సిఎం చంద్రబాబు నాయుడు చేతిలో పెట్టారని దుయ్యబట్టారు. బనకచర్లతో తెలంగాణకు జరుగుతున్న నష్టం గురించి చెప్పడం లేదని కవిత చురకలంటించారు.

# సంపాదకీయం

## దగాకోరు ఎఫ్‌పిపిసిఎ విధానం

ఇంధనం, విద్యుత్ కొనుగోలు వ్యయం సర్దుబాటు (ఎఫ్‌పిపిసిఎ) విధానం వినియోగదారుల నుండి అనవసరంగా, అన్యాయంగా అధిక మొత్తాలను ముందుగానే వసూలు చేయడానికి విద్యుత్ పంపిణీ కంపెనీలకు (డిస్కాం), ప్రసార సంస్థ (ట్రాన్స్‌కో)కు వీలు కల్పించే విధానమది. ఏ ఆర్థిక సంవత్సరానికైనా విద్యుత్ చార్జీలను పెంచరాదని ప్రభుత్వం నిర్ణయిస్తే, అది భరించాల్సిన సబ్సిడీని తగ్గించేందుకు తన రెగ్యులేషన్‌ని ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ కమిషన్ (ఎపిఈఆర్‌సి) తానే ఉల్లంఘిస్తున్నది. వినియోగదారులకు ట్రూడౌన్ కింద ఈ విద్యుత్ సంస్థలు తిరిగి చెల్లించాల్సిన మొత్తాలు వినియోగదారులకు నేరుగా అందకుండా ఉండే రీతిలో కమిషన్ ద్వంద్వ ప్రమాణాలను పాటిస్తున్నది. ఆ మొత్తాలను డిస్కాంలు గుండుగుత్తగా వాటి రెవెన్యూ లోటును తగ్గించేందుకు ముందుగానే పొందే విధంగా కమిషన్ అసంబద్ధ నిర్ణయాలు తీసుకొంటున్నది. వ్యవసాయ వినియోగదారులకు ఉచిత విద్యుత్ సరఫరా విధానం కింద అదనంగా సరఫరా చేసిన విద్యుత్‌కు అవుతున్న అదనపు వ్యయంలో అధిక మొత్తాన్ని వ్యవసాయేతర విద్యుత్ వినియోగదారులపై మోపే రీతిలో కమిషన్ ఎఫ్‌పిపిసిఎ రేట్లను నిర్ణయిస్తూ, ప్రభుత్వం భరించాల్సిన సబ్సిడీని తగ్గిస్తున్నది. ఒక ఆర్థిక సంవత్సరానికి కమిషన్ చార్జీల ఉత్తర్వును (మార్చి నెలలో) జారీ చేశాక, మరుసటి నెల (తదుపరి ఆర్థిక సంవత్సర ఏప్రిల్ మాసం నుండే) ఎఫ్‌పిపిసిఎ కింద యూనిట్‌కు 40 పైసల చొప్పున చార్జీలకు అదనంగా వినియోగదారుల నుండి వసూలు చేస్తున్న విధానం అనేక విధాలుగా ప్రశ్నార్థకంగా మారింది. అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకుని డిస్కాంల రెవెన్యూ లోటును భర్తీ చేసే విధంగా కమిషన్ చార్జీలను నిర్ణయించాక, మరుసటి నెల నుండే ఇలా అదనపు మొత్తాలను వసూలు చేసుకొనేందుకు డిస్కాంలకు అనుమతి ఇవ్వటం అంటే, కమిషన్ చేసిన నిర్ధారణలు రెండు విధాలుగా అసమగ్రమైనవి, అవాస్తవికమైనవి అని భావించాలి. దీనివల్ల డిస్కాంలు వినియోగదారుల నుండి చాలా అధిక మొత్తాలను అనవసరంగా, ముందస్తుగా వసూలు చేయడానికి వీలు కలుగుతున్నది. డిస్కాంల రెవెన్యూ లోటును వాస్తవంగా ఉండేదాని కన్నా తక్కువగా కమిషన్ నిర్ధారించి, చార్జీలను నిర్ణయిస్తే, ప్రభుత్వం ఇవ్వాల్సిన సబ్సిడీ అవసరం తగ్గించడానికి దారితీస్తున్నది. చార్జీలను పెంచలేదని చూపుతూ, ఏడాది అంతా యూనిట్‌కు 40 పైసల చొప్పున అదనంగా వసూలు చేయటంతో పాటు, వేల కోట్ల రూపాయలను ఆర్థిక సంవత్సరం ముగిశాక ట్రూఅప్ కింద డిస్కాంలు క్లెయిమ్ చేయడానికి దారితీస్తున్నది. కమిషన్‌లో దాఖలు చేసిన పిటిషన్ల ప్రకారం, 2024-25 సంవత్సరానికి, రాష్ట్రంలోని మూడు డిస్కాంలు కలిపి ఎఫ్‌పిపిసిఎ కింద మొత్తం రూ.2376.94 కోట్ల మేరకు ట్రూఅప్ క్లెయిమ్‌లను చూపగా, నెలకు యూనిట్‌కు 40 పైసల చొప్పున అవి వసూలు చేసిన మొత్తం రూ.2787.19 కోట్లు. ఇపిడిసిఎల్ రూ.1292.28 కోట్ల మేరకు ట్రూడౌన్ క్లెయిమ్‌ను చూపింది. ఆ మేరకు అనవసరంగా వినియోగదారుల నుండి ఇపిడిసిఎల్ వసూలు చేయడం ఎఫ్‌పిపిసిఎ విధానం ఎంత లోపభూయిష్టంగా ఉన్నదీ స్పష్టం చేస్తున్నది. కాగా, వసూలు చేసిన మొత్తంతో కలిపి ఎస్‌పిడిసిఎల్ రూ.1599.33 కోట్లు, సిపిడిసిఎల్ రూ.963.77 కోట్ల మొత్తాన్ని ట్రూఅప్ కింద చూపడం అనేక ప్రశ్నలకు తావిస్తున్నది. ఇలాంటి వ్యత్యాసాలకు కారణమైన అంశాలపై వివరమైన అధ్యయనం చేయాల్సి ఉంది. మూడు డిస్కాంల క్లెయిమ్‌లను సర్దుబాటు చేసి వినియోగదారులకు రూ.449.60 కోట్లు ట్రూడౌన్ కింద తిరిగి ఇవ్వజూపటం ఘనకార్యమన్నట్లు మూడు డిస్కాంల సిఎండిల తరపున ఇచ్చిన వివరణ హాస్యాస్పదం. మూడు డిస్కాంలు గత ఆర్థిక సంవత్సరంలో యూనిట్‌కు రూ.40 పైసల చొప్పున వినియోగదారుల నుండి వసూలు చేసిన రూ.2787.19 కోట్ల నుండి రూ.449.60 కోట్ల మొత్తాన్ని వినియోగదారులకు తిరిగి ఇవ్వజూపుతున్నాయి తప్ప తమ వ్యయాన్ని తగ్గించుకొని, పొదుపు చేసి ఈ మొత్తాన్ని వినియోగదారులకు ఇవ్వటం లేదు. వాస్తవానికి, కమిషన్ ఉత్తర్వులో అనుమతించిన చార్జీలకు మించి గత ఆర్థిక సంవత్సరంలో రూ.2787 కోట్ల మేరకు వినియోగదారులపై అదనపు భారాన్ని మోపాయి ట్రాన్స్‌కో వసూలు చేయాల్సిన ప్రసార చార్జీలను, డిస్కాంలు వసూలు చేయాల్సిన పంపిణీ చార్జీలను కమిషన్ అయిదేళ్ళ నియంత్రణ కాలానికి ఏటా ఎంత ఉండాలో నిర్ణయిస్తూ బహుళ సంవత్సర చార్జీల (ఎంవైటి) ఉత్తర్వులను జారీ చేస్తున్నది. ప్రసార, పంపిణీ వ్యాపారాలకు సంబంధించి ట్రాన్స్‌కో, డిస్కాంల రెవెన్యూ అవసరాలలో వస్తున్న తేడాలను బట్టి వచ్చే ట్రూ అప్ లేదా ట్రూ డౌన్ మొత్తాలను అయిదేళ్ళ నియంత్రణ కాలం ముగిశాక సర్దుబాటు చేయాలని కమిషన్ రెగ్యులేషన్‌లో నిర్దేశించింది. డిస్కాంల విద్యుత్ సరఫరా వ్యాపారానికి సంబంధించి, ఏడాది ముగిశాక కమిషన్ ఇస్తున్న ట్రూ అప్ సర్దుబాటు ఉత్తర్వుల ప్రకారం ఎన్ని నెలల పాటు నెలకు యూనిట్‌కు మూడు డిస్కాంలు వసూలు చేసుకొనేందుకు అవసరమైన మొత్తాలను కమిషన్ నిర్ణయిస్తున్నది. ప్రతి నెలా వినియోగదారుల నుండి వసూలు చేస్తున్నాయి. సాధారణంగా, విద్యుత్ సరఫరా వ్యాపారానికి డిస్కాంలు ట్రూఅప్ మొత్తాలను చూపుతున్నాయి. ప్రసార, పంపిణీ వ్యాపారాలకు సంబంధించి, ట్రాన్స్‌కో, డిస్కాంలు ప్రతిపాదించిన, కమిషన్ అనుమతించిన మేరకు నియంత్రణ కాలంలో ఏటా అవి పెట్టుబడి వ్యయం చేయటం లేదు. దానివల్ల, వాటి రెవెన్యూ అవసరాలు కమిషన్ ఎంవైటి ఉత్తర్వులలో నిర్ధారించిన దానికన్నా తక్కువగా తేలి, ట్రూడౌన్ మొత్తాలను చూపుతున్నాయి. ఈ ట్రూడౌన్ మొత్తాలు తేలుతున్నది వాటి నిర్వహణ సామర్థ్యం మెరుగుపడటం వల్ల కాదు. అవసరమైన దానికన్నా అధిక మొత్తాలను చార్జీల రూపంలో వసూలు చేస్తుండటం వల్లనే. 2023-24 సంవత్సరంతో ముగిసిన అయిదేళ్ళ నాల్గవ నియంత్రణ కాలానికి ఎ.పి ట్రాన్స్‌కో తన ప్రసార వ్యాపారానికి రూ.1059.75 కోట్ల మొత్తాన్ని ట్రూడౌన్ కింద చూపింది. ఇదిగాక, మరో రూ.510 కోట్ల ట్రూడౌన్ మొత్తాన్ని గత ఆర్థిక సంవత్సరానికి డిస్కాంల రెవెన్యూ లోటును తగ్గించేందుకు కమిషన్ విద్యుత్ సరఫరా చార్జీల ఉత్తర్వులో సర్దుబాటు చేసింది. దానివల్ల, చార్జీలను పెంచరాదని నిర్ణయించిన ప్రభుత్వం ఇవ్వాల్సిన సబ్సిడీ అవసరం ఆ మేరకు తగ్గింది. కమిషన్ అలా సర్దుబాటు చేయకుండా ఉంటే, ఆ మొత్తాన్ని కూడా డిస్కాంలు వినియోగదారులకు తిరిగి చెల్లించాల్సి వచ్చేది. అదేవిధంగా, డిస్కాంలు తమ పంపిణీ వ్యాపారానికి నాల్గవ నియంత్రణ కాలానికి చూపిన ట్రూఅప్, ట్రూడౌన్ క్లెయిమ్‌ల మొత్తాల నుండి 2024-25 సంవత్సరానికి రెవెన్యూ లోటులో ఎస్‌పిడిసిఎల్‌కు సంబంధించి రూ.2000 కోట్లు, ఇపిడిసిఎల్‌కు రూ.1800 కోట్లు, సిపిడిసిఎల్‌కు రూ.1400 కోట్ల మేరకు సర్దుబాటు చేసింది. ఆ మేరకు కూడా ప్రభుత్వం ఇవ్వాల్సిన సబ్సిడీ అవసరం తగ్గింది. వినియోగదారులకు తిరిగి చెల్లించాల్సిన మొత్తం రాకుండా పోయింది. అలా సర్దుబాటు చేయకుండా ఉంటే ఆ మొత్తాలను కూడా డిస్కాంలు వినియోగదారులకు తిరిగి చెల్లించాల్సి వచ్చేది. విద్యుత్ సరఫరా వ్యాపారానికి సంబంధించి అదనపు విద్యుత్ కొనుగోళ్ళు, ఆదాయ వ్యయాలలో వస్తున్న తేడాలను డిస్కాంలు ప్రతినెలా సమర్పిస్తున్నా, ఇపిడిసిఎల్ నెలకు యూనిట్‌కు 40 పైసల చొప్పున అనవసరంగా వసూలు చేస్తున్నా, కమిషన్ నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించింది. అదేవిధంగా, ట్రాన్స్‌కో ప్రసార వ్యాపారానికి, డిస్కాంల పంపిణీ వ్యాపారానికి సంబంధించి కమిషన్ ప్రతి ఏటా సమీక్ష చేస్తున్నా, అనవసరమైన అదనపు వసూళ్ళకు సంబంధించి కూడా కమిషన్ అదేవిధంగా వ్యవహరించింది. ఎఫ్‌పిపిసిఎ మొత్తాలను ప్రతి నెలా విద్యుత్ బిల్లులో చూపి వసూలు చేసేందుకు డిస్కాంలకు అనుమతిస్తున్న కమిషన్, ట్రూడౌన్ మొత్తాలను కూడా అదేవిధంగా విద్యుత్ బిల్లులో చూపి ఆ మేరకు బిల్లు మొత్తాలను తగ్గించాలని ఆదేశించకుండా ద్వంద్వ ప్రమాణాలను పాటిస్తున్నది. ప్రసార, పంపిణీ వ్యాపారాలకు సంబంధించి అయిదేళ్ళ నియంత్రణ కాలం ముగిసిన తరువాతనే ట్రూఅప్, ట్రూడౌన్ మొత్తాలను సర్దుబాటు చేయాలని రెగ్యులేషన్‌లో నిర్దేశించిన కమిషన్ ట్రూడౌన్ మొత్తాలను డిస్కంల ఆర్థిక లోటును తగ్గించేందుకు వాటి వార్షిక చార్జీల ఉత్తర్వులో సర్దుబాటు చేస్తూ తన రెగ్యులేషన్‌ను తానే ఉల్లంఘిస్తోంది.

ఎఫ్‌పిపిసిఎ కింద ట్రూ అప్ మొత్తాలను, రేట్లను మూడు డిస్కాంలకు వేర్వేరుగా, కమిషన్ నిర్ణయిస్తున్నది. ప్రతి డిస్కాముకు యూనిట్‌కు ఈ మొత్తాన్ని అన్ని కేటగిరీల వినియోగదారులకు ఒకే విధంగా నిర్ణయించం వల్ల అనేక అసంబద్ధతలు చోటు చేసుకుంటున్నాయి. దీనివల్ల సబ్సిడీ పొందుతున్న వినియోగదారులకు క్రాస్ సబ్సిడీ, ప్రభుత్వ సబ్సిడీ లేకుండా పోయి, అధిక మొత్తాలను వారు చెల్లించాల్సి వస్తున్నది. అదనపు విద్యుత్‌ను ఏ వినియోగదారులకు, ఏ మేరకు సరఫరా చేశారు? అందుకు ఎంత అదనపు మొత్తం ఖర్చయింది? చార్జీల రూపంలో వారి నుండి ఎంత వసూలు చేశారు? ఎంత వసూలు చేయలేదనే దానితో నిమిత్తం లేకుండా, ఎఫ్‌పిపిసిఎ మొత్తాలను అందరికీ సమానంగా నిర్ణయించటం ద్వారా వ్యవసాయానికి ఉచిత విద్యుత్ విధానం కింద అదనపు సరఫరాకు ప్రభుత్వం అదనంగా చెల్లించాల్సిన సబ్సిడీలో గణనీయమైన మొత్తం వ్యవసాయేతర వినియోగదారులపై ఈ లోపభూయిష్ట విధానంలో మోపుతున్నారు. క్రాస్ సబ్సిడీ ఇస్తున్న, సబ్సిడీ పొందుతున్న వినియోగదారుల నుండి అదనపు విద్యుత్ సరఫరాకు కమిషన్ నిర్ణయించిన చార్జీలను వసూలు చేస్తున్నారు. దానితో, ఆ చార్జీలకు మించిన అదనపు వ్యయాన్ని మాత్రమే డిస్కాంలు ట్రూఅప్ కింద వసూలు చేయాలి. వ్యవసాయానికి ఉచిత విద్యుత్, ఉచిత విద్యుత్ పొందుతున్న మరికొన్ని కేటగిరీల వినియోగదారుల నుండి అదనపు విద్యుత్ సరఫరాకు చార్జీలను వసూలు చేయటం లేదు. ఈ విధంగా ఉచిత విద్యుత్ పొందుతున్న వినియోగదారులకు అదనంగా సరఫరా చేసిన విద్యుత్‌కు అయ్యే అదనపు మొత్తాన్ని పూర్తిగా ప్రభుత్వ సబ్సిడీగా ఇవ్వాలి.

# హదుమీరుతున్న నేతల రాజకీయ భాష !

రాజకీయ నాయకుల విమర్శల్లో భాష హద్దు దాటుతోంది. హుందాగా ఉండాల్సిన వారు బజారు భాష మాట్లాడుతున్నారు. విమర్శల కోసం ఏదిపడితే అది మాట్లాడుతున్నారు. ముఖ్యంగా పదేళ్ల అధికారం వెలగబెట్టిన బిఆర్‌ఎస్ నేతలు, ఐదేళ్లు అధికారం వెలగబెట్టిన వైకాపా నేతలు ఇష్టానుసారంగా విమర్శలు చేస్తున్నారు. పత్రికలు, ఛానళ్లు కూడా వీటిని యదాతథంగా ప్రసారం చేస్తున్నాయి. నాయకుల విమర్శలు చేసే సమయంలో మాట్లాడే భాషపై ఆంక్షలు విధించాలి. లేకుంటే రానురాను అది పరిధి దాటి పోగలదు. మంత్రులుగా చేసిన వారు, ముఖ్యమంత్రులుగా చేసిన వారు సైతం భాషను పరిధి దాటి వినియోగిస్తున్నారు. సన్నాసి, లుచ్ఛా లఫంగా, ఏం పీకుతావ్, రఫారఫా,సిగ్గులేదు... ఇలా అనేక రకాల పదాలు వాడుతున్నారు. కావాలనే అన్ని పదాలను ఇక్కడ ప్రస్తావించడం లేదు. తెలంగాణలో దాదాపు పదేళ్లు పాలన చేసిన కెసిఆర్ తెలంగాణ ఉద్యమంలో భాషను సాధనంగా చేసుకున్నారు. అధికారంలోకి వచ్చిన తరవాత మార్పు కనిపించింది. మధ్యలో కొంతకాలం మళ్లీ ఎదురుదాడి చేసే సమయంలో దుర్భాషను వాడారు. ఇప్పుడు బిఆర్‌ఎస్ నేతలు కెటిఆర్, హరీష్ రావులతో పాటు ఇతర నేతలు కూడా హద్దుమీరి మాట్లాడుతున్నారు. ఓ రకంగా చెప్పాలంటే కాంగ్రెస్ నేతలే కొంత సంయమనం పాటిస్తున్నారు. ఎపిలో జనగ్ ఆయన అనుచరులు కూడా ఇలాగే తెగించారు. ఇలాంటి భాష మాట్లాడితే ప్రజలు మెచ్చి అధికారం కట్టబెడతారని వారు భావిస్తున్నట్లుగా ఉంది. తెలంగాణ రాష్ట్రం సాధించుకున్న తర్వాత కల్వకుంట్ల కుటుంబ సభ్యులంతా అధికారం అనుభవించారు. వారి చుట్టాలు, పక్కాలు, కులమైతే చాలన్నట్లుగా పదవులను చేపట్టారు. సంతోష్‌తో పాటు సమీప బంధువులు కూడా మంత్రి పదవుల నుంచి ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు అనేక ఉన్నతస్థాయి నామినేటెడ్ పదవులు పొందారు. ఉద్యమం చేసి ప్రాణత్యాగాలు చేసిన 1400 మంది కుటుంబాలను, ఇతరులను ఉద్యమ నాయకుడు కెసిఆర్ గడ్డిపరకల్లా తీసి అవతల పడేశారు. ప్రొపెసర్ కోదండరామ్ లాంటి వారిని కూడా మర్చిపోయారు. జర్నలిస్టులను గంజిలో ఈగల్లాగా విసిరి పడేశారు. ఇప్పుడు అధికారం పోయేసరికి వారికి పిచ్చెక్కినట్లుగా ఉంది. అందుకే ఏడాదిన్నరకే నిత్యం రంకెలు వేస్తున్నారు. కాంగ్రెస్ మొత్తం ఏదో తప్పిదం చేసిందన్న భావనలో ఉచ్చనీచాలు మరచి విమర్శలు చేస్తున్నారు. ముఖ్యంగా కెటిఆర్ వాడుతున్న భాష జుగప్సాకరంగా ఉంది. ప్రత్యేక తెలంగాణ ఆవిర్భవించా క అధికారం చేబూనిన కల్వకుంట్ల కుటుంబం అసలు ప్రజలను మనుషులగా చూడలేదు. తెలంగాణను తమ





తెలంగాణ న్యాయవాదుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి రిటైర్ జడ్జి కాంగ్రెస్ నాయకుడు రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి

సొంత జాగీరుగా భావించారు. ఆడిందే ఆటగా పాలన సాగించారు. అధికారంలో ఉండి లక్షలాది మంది ఉద్యమకారుల త్యాగాలను, ఆశయాలను తుంగలో తొక్కారు. అధికారాన్ని అడ్డంపెట్టుకుని తమ సామాజిక వర్గపు వారి సంక్షేమానికే ప్రాధాన్యం ఇచ్చారు. పోలీసులు,ఇతర అవినీతి అధికారుల అండదండలతో ప్రజాధనాన్ని, హైదరాబాద్ చుట్టుపక్కల ఉన్న వేలాది ఎకరాల భూములను కుటుంబ సభ్యులు, సమీప బంధువులు, కుటుంబానికి వత్తాసు పలికిన నాయకులకు పంచిపెట్టడం జరిగింది. కాళేశ్వరం మొదలు అనేక విషయాల్లో జరిగిన అవినీతి చూస్తుంటే ఎంతగా తెగించారా అని అర్థం అవుతోంది. ఎసిబి దాడులు, ఇడి విచారణలు, కొనసాగుతున్న దర్యాప్తులతో కళ్లు చెదిరిపోతున్నాయి. వందలకోట్లు అధికారులే వెనకేసుకుంటే ఇక అసలు నాయకులు ఎంత వెనకేసుకున్నారో ఊహించుకోవచ్చు. అంతెందుకు ఫార్ములా కేసులో డబ్బులు నేరుగా దాటించిన కెటిఆర్ బరితెగించి మాట్లాడుతున్నారు. లొట్టపీసు కేసు అని అంటున్నారు. అంటే ఎంతగా డబ్బు మదం ఉంటే ఇలా మాట్లాడగలరో అర్థం చేసుకోవాలి. ఇలా లొట్టపీసు కేసు..ఏం పీక్కుంటారో పీక్కోండి అని అనడం ఎంతవరకు సబబో చెప్పాలి. ఎపిలో జగన్ కూడా ఇలాగే నా వెంట్రుక కూడా పీకలేరు అని అనడం చూశాం. ఇలా మంత్రులుగా, సిఎంగా చేసిన వ్యక్తులు మాట్లాడాల్సిన భాషేనా అని ప్రజలు నిలదీసే రోజులు తప్పకుండా వస్తాయి. రావాలి కూడా. అనేక ప్రభుత్వ శాఖలలో కుటుంబ సభ్యులు చేసిన అక్రమాలను ఒక్కొక్కటిగా వెలికితీస్తున్న అనేక దర్యాప్తుల విషయాలను సోషల్ మీడియా ప్రజలకు తెలియజేయడం తప్పు ఎలా అవుతుంది.? తాము అధికారంలో ఉన్నప్పుడు ప్రజలపై మీడియా సంస్థలపై ప్రతిపక్షాలపై నిఘా, నియంత్రణ, అణచివేత కొనసాగిన విషయం కేటీఆర్ మర్చి పోయి ఉంటాడు. అందుకే అసహనంతో విమర్శలు చేసే క్రమంలో ఉచ్చనీచాలు మరచి మాట్లాడుతున్నారు. అధికారం ఉన్నప్పుడు తెలంగాణ నీళ్లు పంపిణీ చేసి రాయలసీమను రతనాల సీమను చేస్తామని ప్రకటించారు. ఇప్పుడేమో సిఎం రేవంత్ రెడ్డి బాబుకు నీళ్లు దానం చేశారని విమర్శలు చేస్తున్నారు. మేడిగడ్డమీద చర్చ పెడతామంటారు. సవాళ్లు విసరుతారు. నిజానికి ప్రభుత్వాలు, ప్రతిపక్షాలు ఉన్నవి సవాళ్లు విసరడానికా లేక పాలన సాగించడానికా అన్నది ప్రజలు చర్చించాలి. ఆనాటి ముఖ్యమంత్రి జగన్ రెడ్డిని కాళేశ్వరం ప్రారంభోత్సవానికి పిలవడం చూశాం. ఆయన ప్రమాణస్వీకారానికి అమరావతి వెళ్లి సంబురాలు చేసుకోవడం చూశాం. మంత్రి రోజా ఆహ్వానాన్ని అందుకొని నగరి సందర్శించి ఆతిథ్యం పుచ్చుకోవడం కూడా చూశాం. ఇవన్నీ మరచిపోయిన కెటిఆర్, హరీష్ రావులు ఇప్పుడు ఇష్టానుసరాంగా వ్యంగ్యాలు పలుకుతున్నారు. కేవలం ఒక కుటుంబం అధికారానికి, అక్రమాస్తుల కోసం, అహంకారానికి మాత్రమే తెలంగాణ సాధించామా అన్న బాధ కలుగుతోంది. ఇకనైనా తెలంగాణ ప్రజల భాషను, నిజాయితీ, సంస్కృతి, మంచితనం పాటిస్తే మంచిది. జగన్ కూడా తనతండ్రి వైఎస్ లాగా హుందాగా ఉండడం నేర్చుకోవాలి. భాషను తిట్టడానికి ఉపయోగించరాదు. ఇరుపార్టీల నేతలు హుందాగా ప్రతిపక్ష బాధ్యతలు నెరవేర్చాలి. ప్రభుత్వ తప్పులను ఎత్తి చూపాలి. ప్రజలకు మేలుచేసేలా చర్యలు ఉండాలి. ప్రతిపక్ష పాత్రను క్రమశిక్షణతో,బాధ్యతగా నిర్వహించినప్పుడే ప్రజలు ఆదరిస్తారని గుర్తించి మసలుకుంటే మంచిది.

# నాటో బెదిరింపులు

ప్రపంచాన్ని తన ఆధీనంలో ఉంచుకునేందుకు అమెరికా పాలకవర్గం ఎంతకైనా తెగిస్తుందన్నది కమ్యూనిస్టులకు ఎప్పుడో తెలుసు. అయినప్పటికీ అమెరికా అంటే వ్యతిరేకం గనుక వారు అలాగే చెబుతారులే అని పట్టించుకోనివారికి ఇప్పుడు తత్వం తలకెక్కుతోంది. ఇదొక శుభపరిమాణం. భాగస్వాములు, మిత్రులు అని చెబుతూనే తన కనుసన్నల్లో నడవాలని అనేక దేశాల మీద ఒత్తిడి తెస్తున్న అమెరికా ఇప్పుడు మిలిటరీ కూటమి నాటోను కూడా రంగంలోకి తీసుకురావటం మరింత ప్రమాదకరం. తన వ్యవహారాలేవో తాను చూసుకోకుండా అమెరికా రాజకీయ, ఆర్థిక ప్రయోజనాలకోసం అది హద్దులు దాటింది. ఉక్రెయిన్ మీద రష్యా మిలిటరీ చర్యను ఆపాలంటే భారత్, చైనా, బ్రెజిల్ ఒత్తిడి తెచ్చి పుతిన్‌ను శాంతి ఒప్పందానికి తీసుకురావాలట. యాభై రోజుల్లో పోరు ముగించక పోతే దానితో వాణిజ్య లావాదేవీలు జరిపే దేశాలపై వంద శాతం సుంకాలు విధిస్తానన్న ట్రంప్ బెదిరింపు తర్వాత, అతగాడితో భేటీ జరిపి బుధవారంనాడు నాటో ప్రధాన కార్యదర్శి మార్క్ రూటే అదే పల్లవి అందుకున్నాడు.

ఇతర దేశాలను బెదిరించే ముందు చేతనైతే ఐరోపా యూనియన్ దేశాలతో రష్యా ఇంధన కొనుగోలు ఆపివేయించాలి. ఉక్రెయిన్ వివాదంలో భారత్, చైనా, బ్రెజిల్ తటస్థంగా ఉన్నాయి. దానికి భిన్నంగా ఐరోపా ఒక చేత్తో జెలెన్‌స్కీకి గతేడాది 22బిలియన్ డాలర్ల మేర ఆయుధాలు అందచేసింది. మరో చేత్తో రష్యా నుంచి 25బిలియన్ డాలర్ల మేర చమురు, గ్యాస్ కొనుగోలు చేసింది. భారత్, చైనా చమురు కొనుగోలు ద్వారా రష్యాకు ఊతమిచ్చి పరోక్షంగా ఉక్రెయిన్ మీద దాడిని సమర్థిస్తున్నాయంటున్న పెద్దలకు ఐరోపా చేస్తున్నదేమిటో కనిపించటం లేదా ? ఉక్రెయిన్ సంక్షోభానికి ముందు ఐరోపా తన అవసరాలకు రష్యా నుంచి 45శాతం గ్యాస్ తెచ్చుకొనేది, ఇప్పుడు 19 శాతానికి తగ్గించుకుంది.మిలిటరీ చర్య కొనసాగితే




2027 నాటికి పూర్తిగా నిలిపి వేస్తామని చెబుతున్నది. తాము విధించిన ఆంక్షలను తామే ఉల్లంఘించి మూడో దేశం ద్వారా ఇప్పటికీ రష్యన్ చమురు ఉత్పత్తులను దిగుమతి చేసుకుంటున్న ఐరోపా సిగ్గుమాలిన చర్య గురించి తెలియనిదెవరికి?

హంగరీ, స్లోవేకియా వంటి దేశాలు ఆంక్షలను వ్యతిరేకించి నేరుగా దిగుమతి చేసుకుంటున్నాయి. ఫ్రాన్స్, ఆస్ట్రియా, స్పెయిన్, గ్రీస్, ఇటలీ గణనీయమొత్తంలో చమురు దిగుమతి చేసుకుంటూ రష్యా కోశాగారాన్ని నింపుతున్న సంగతి నాటో నేతకు తెలియదా? అదరగొండితనం గాకపోతే వారు చేస్తే సంసారం, మిగతావారు చేస్తే మరొకటా? ఉక్రెయిన్ సంక్షోభాన్ని పరిష్కరించాలన్న చిత్తశుద్ధే ఉంటే ఉక్రెయిన్‌కు నాటో సభ్యత్వ తీర్థపు అజెండాను పక్కన పెడితే చాలు. దానికి బదులు ఇప్పటి వరకు ఆత్మరక్షణకు ఇస్తున్నామన్న ఆయుధాలను ఎదురుదాడులకూ విస్తరింపచేస్తామని చెప్పటాన్ని ఏమనాలి. అసలు విషయం ఏమంటే రష్యా, చైనాలను కట్టడి చేయాలి, వాటిని దెబ్బతీయాలన్న దుష్ట సంకల్పం దీనికి మూలం.రష్యాపై ఆంక్షల అనుమతి చట్టం 2025పేరుతో రిపబ్లికన్ పార్టీ సెనెటర్లు ఒక బిల్లును ప్రవేశపెట్టారు. దాని ప్రకారం రష్యాతో ఇంధనంతో సహా ఇతర కొనుగోళ్లు చేసే దేశాలపై 500శాతం సుంకాలను విధించేందుకు ట్రంప్‌కు అధికారాన్ని కట్టబెడతారు.

ఒక వైపు ఇలాంటి చర్యలకు పాల్పడుతూ మరోవైపు ఇతర పద్దతులనూ అమెరికా వినియోగిస్తున్నది.చైనాతో వాణిజ్య లావాదేవీలు, ఇతర ఒప్పందాలను కొనసాగిస్తే శ్రీలంక వస్తువుల దిగుమతులపై అధిక సుంకాలు విధిస్తామని అమెరికా చేసిన బెదిరింపును ప్రభుత్వం తిరస్కరించింది. అక్కడ ఉన్నది వామపక్ష ప్రభుత్వం గనుక ట్రంప్ బెదిరింపులను బహిరంగ పరచింది. గుట్టుగా ఉంచుతున్న దేశాల సంగతేమిటి ? ఆధిపత్యాన్ని సొమ్ము చేసుకోవటం, వాణిజ్య దౌత్యం పేరు ఏదైనా యావత్ ప్రపంచం ఇలాంటి వాటిని ఖండించాలి. తమ ప్రయోజనాలను ఫణంగా పెట్టి ఇతర దేశాలతో ఒప్పందాలు కుదుర్చుకుంటే సహించేది లేదని,ఇలాంటి వాటిని గమనంలో ఉంచుకొనే కొద్ది వారాల క్రితం ట్రంప్‌ను చైనా హెచ్చరించింది. అదేదో చైనాతో అమెరికా పంచాయితీ మనకు ఉండదులే అని ఎవరైనా అనుకుంటే తప్పులో కాలేసినట్లే.విభజించి పాలించే నీతి గురించి వేరే చెప్పనవసరం లేదు. చైనాతో సంబంధాలను వదులుకొనేది లేదు, మరింతగా పెంచుకుంటామంటూ ఒక చిన్న దేశం శ్రీలంక చూపిన ధైర్యాన్ని కొనియాడాల్సిందే. దీన్నుంచి మనదేశం ఏమైనా నేర్చుకుంటుందా?

## ఏసీపీ నీ కలిసిన కృష్ణ మూర్తి చారి



**శేరిలింగంపల్లి ,ప్రజా స్వేచ్ఛ**
క్రమశిక్షణకు మారుపేరు, ఆపదలో నేనున్నా అంటూ అభయహస్తం ఇచ్చే ఆపద్బాంధవుడు, విశాల హృదయుడు, శౌర్యవంతుడు, హైదరాబాద్ ఏసిపి కే.ఎమ్ కిరణ్ కుమార్ 34 సంవత్సరాలు పోలీసు శాఖలో సర్వీసును పూర్తి చేసుకొని 35వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా కంజర్ల కృష్ణమూర్తి చారి ఫౌండేషన్ చైర్మన్ మరియు విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ ఐక్య సంఘం పటాన్ చెరు నియోజకవర్గం అధ్యక్షులు కంజర్ల కృష్ణమూర్తి చారి కలిసి సన్మానించి, హార్దిక శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజేందర్ చారి, సునంద, సాయి వెంకట హర్ష, శ్రీనివాస్ చారి తదితరులు పాల్గొన్నారు.

## స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎంపీపీ, జడ్పీటిసి స్థానాలు బీసీ లకు కేటాయించాలి



**నాంపల్లి, ప్రజా స్వేచ్ఛ**
స్థానిక సంస్థల ఎన్నికలలో నాంపల్లిలోని ఎంపీపీ, జడ్పీటిసి స్థానాలు బీసీలకు కేటాయించాలని బీసీ సంఘం యూత్ మండల అధ్యక్షులు నాంపల్లి సతీష్ అన్నారు. గురువారం నాంపల్లి లో ఆయన మాట్లాడుతూ మండలంలో సగానికి పైగా బీసీ జనాభా ఉండి అధిక ఓట్లు బీసీలే వున్నాయి. ఈ స్థానిక ఎన్నికలలో బీసీ లకే కేటాయించాలని డిమాండ్ చేశారు. బీసీ లు ఐక్యతతో పోరాడి పని చేస్తూ రానున్న రోజులలో ఏ ఎన్నికలు వచ్చిన బీసీ అభ్యర్థులకి అండగా ఉండాలన్నారు. బీసీ యువకులని చైతన్యం చేయడం కోసం మండలంలో రౌండ్ టేబుల్ సమావేశాలు, యువ సమ్మేళనాలు,బీసీ విద్యావంతుల సమావేశాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు.

## ఈ నెల 21 నుంచి జరిగే పార్లమెంట్ సమావేశాల్లో బీసీ బిల్లు పెట్టాలి

**బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి లింగంగౌడ్**



**మిర్యాలగూడ ప్రజా స్వేచ్ఛ**
ఈ నెల 21 నుంచి జరిగే పార్లమెంట్ సమావేశాల్లో బీసీ బిల్లు పెట్టాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఎన్ఎస్పీ అతిథి గృహంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో బీసీలకు స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లపై చేసిన బిల్లును కేంద్ర ప్రభుత్వం యధావిధిగా ఆమోదించి బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించే విధంగా కృషి చేయాలన్నారు. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ల పేరుతో అగ్రకులాలకు రాత్రికి రాత్రే 10 శాతం రిజర్వేషన్లు కల్పించారని బీసీ రిజర్వేషన్ విషయంలో ఎందుకు నాన్చివేత ధోరణి అవలంబిస్తున్నారని కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీశారు. తెలంగాణ ప్రాంత బీజేపీ యంపిలు కేంద్రం ప్రభుత్వం పై ఒత్తిడి తీసుకొచ్చి బీసీ రిజర్వేషన్ బిల్లును ఆమోధించి తొమ్మిదవ షెడ్యూల్ లో చేర్చే విదంగా భాద్యత తీసుకోవాలని డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమంలో బంటు వెంకటేశ్వర్లు ముదిరాజ్, గుండెబోయిన నాగేశ్వరరావు యాదవ్, యర్రబెల్లి దుర్గయ్య రజక, ఊరిబండి శ్రీనివాస్ యాదవ్, దోనేటి శేఖర్ ముదిరాజ్, నక్క నాగరాజు, మాషన బోయిన సైదులు యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

## భీమారం లో జిల్లా కలెక్టర్ పర్యటన.



**మంచిర్యాల జిల్లా,ప్రజా స్వేచ్ఛ**
భీమారం మండల కేంద్రంలో జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ వనం మహోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో టాయిలెట్స్ నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం ఇటీవల ఈదురు గాలులతో డైనింగ్ హాల్ పైకప్పు విరిగిపడిన గిరిజన ఆశ్రమ బాలుర పాఠశాల హాస్టల్ ను సందర్శించినారు. వీలైనంత త్వరగా మరమ్మత్తులు చేయాలని డి ఈ విద్యాసాగర్ కి ఆదేశాలు జారిచేసారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంట భీమారం మండల కాంగ్రెస్ నాయకులు కొక్కుల నరేష్ , వేముల అరుణ్ కుమార్ లు పాల్గొన్నారు.

# టిఎస్ జేఏ జిల్లా సెక్రెటరీగా మేడి యాకోబు నియామకం

-నియామక పత్రం అందజేసిన అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు కందుకూరి యాదగిరి ...
-ఖమ్మంలో జరిగిన కార్యక్రమంలో బాధ్యతను అప్పగిస్తూ రాష్ట్ర కమిటీ పలు సూచనలు ...
- రాష్ట్ర కమిటీకి కృతజ్ఞతలు తెలియజేసిన మేడి యాకోబు ...



**తల్లాడ- ప్రజా స్వేచ్ఛ**
తెలంగాణ స్టేట్ జర్నలిస్ట్ అసోసియేషన్ ఖమ్మం జిల్లా సెక్రెటరీగా తల్లాడ మండలానికి చెందిన జర్నలిస్టు మేడి యాకోబ్ ను నియమిస్తూ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు కందుకూరి యాదగిరి రాష్ట్ర నాయకత్వం ఆధ్వర్యంలో నియామక పత్రాన్ని అందజేశారు.గురువారం ఖమ్మం జిల్లా కేంద్రంలో నిర్వహించిన నూతన కమిటీ ఏర్పాటు సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని ఆయన మాట్లాడారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు జర్నలిస్టులను విస్మరిస్తే జర్నలిస్టుల ఆగ్రహానికి గురికావాల్సి వస్తుందని హెచ్చరించారు.ఖమ్మం జిల్లా కమిటీకి పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా యాకూబ్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర అధ్యక్షులు యాదగిరి అన్నకు,జిల్లా అధ్యక్షులు కొమ్ము ప్రసాద్ అన్నకు మరియు రాష్ట్ర కమిటీకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అసోసియేషన్ నియమ నిబంధన ప్రకారం జర్నలిస్టుల సంక్షేమం కోసం అసోసియేషన్ అభివృద్ధి కోసం కృషి చేస్తానని పేర్కొన్నారు.ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు కందుకూరి యాదగిరి నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులను సభకు పరిచయం చేశారు. ఉపాధ్యక్షుడిగా ఉదయగిరి రవి,ప్రధాన కార్యదర్శిగా మేడి యాకోబు,కోశాధికారిగా నారపోగు కృష్ణ, సహాయ కార్యదర్శిగా మలిశెట్టి నాగేశ్వరరావులను నియమించారు. అనంతరం మరికొందరికి నూతనంగా సభ్యత్వాలను అందించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు లింగంపల్లి నాగబాబు,రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు గట్టిగుండ రాము, సూర్యాపేట నియోజకవర్గ అధ్యక్షులు యాతాకుల మధుసూదన్,మోతే మండలం కార్యదర్శి గురజాల వెంకన్న, పలువురు ఖమ్మం జర్నలిస్టులు తదితరులు పాల్గొన్నారు..

## ప్రభుత్వ భూములను పరిరక్షించాలి

**బిఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి..**



**ఆర్మూర్,ప్రజా స్వేచ్ఛ**
ఆర్మూర్ మున్సిపల్ పరిధిలో ఉన్న పెర్కిట్,కొటార్ మూర్,మామిడిపల్లి గ్రామలో ఉన్న లేవుట్లో వదిలిన 10/. పర్సెంట్ భూములను పరిరక్షించాలని ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేశ్ రెడ్డి అన్నారు.గురువారం ఆర్మూర్ పట్టణంలో మున్సిపల్ కమిషనర్ తో కలిసి 10/. పర్సెంట్ భూములను పరిశీలించి వాటి హద్దులు గుర్తించాలని అన్నారు.కబ్జా అయిన భూములు అన్యాక్రాంతం అయినా భూములలో హద్దులు గుర్తించి ప్రభుత్వ బోర్డు పెట్టాలని మొత్తం 4ఎకరాల పైన భూమి వివిధ వెంచర్లలో గుర్తించాం అని అన్నారు.ఎవరైనా ప్రభుత్వ భూమిని కబ్జా చేస్తే ఊరుకునేది లేదని ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి అన్నారు.ప్రభుత్వ భూములో మొక్కలను నాటాలని అధికారులకు ఆదేశించిన ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి ప్రభుత్వ భూముల్లో మొక్కలను నాటడం వల్ల భవిష్యత్ తరాల వారికి స్వచ్ఛమైన గాలిని అందించడం జరుగుతుందని అన్నారు.అనంతరం మామిడిపల్లి లోఅర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనం పనులను పరిశీలించారు.నాణ్యత తో కూడిన కట్టడాలు చేయాలని అన్నారు.పేర్కిట్ విశాఖ కాలనిలో ఇరిగేషన్ భూముల హద్దులు గుర్తించాలని అధికారులు సమన్వయంతో పని చేయాలని అసైన్డ్ భూములలో కట్టడాలకు పర్మిషన్ ఇవ్వకుండా ఉండాలని మున్సిపల్ కమిషనర్ కు చెప్పడం జరిగింది.ప్రభుత్వ భూములను పరిరక్షించే బాధ్యత కాలనీవాసులదేనని అన్నారు.గుండ్ల చెరువు సుందరీకరణ పనులను పరిశీలించరూ.వినాయక విగ్రహాలు నిమజ్జనం చేసే సందర్భంలో విగ్రహాలు లోపలకు రావడం కష్టం అవుతుంది అని రోడ్డును మరింత వెడల్పు చేయాలని అధికారులకు చెప్పడం జరిగింది.గత ప్రభుత్వం లో మినీ ట్యాంక్ బండ్ మంజూరు కావడం జరిగిందని ఏ ప్రభుత్వం అయినా ప్రజలకు మంచి చేయాలని చూస్తుందని రాజకీయం అవసరం లేదని కేవలం ఎన్నికల వరకు మాత్రమే రాజకీయమని అని అన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రాజు, బిజెపి పట్టణ అధ్యక్షుడు మందుల బాలు,బిజెపి సీనియర్ నాయకులు కలిగోట్ గంగాధర్,కలిగోట్ ప్రశాంత్, కొట్టాల సుమన్,పోల్కం వేణు, కొందాపురం చిన్నారెడ్డి,గో జూర్ మధు,పోచంపేట్ శీను, తదితరులు పాల్గొన్నారు.

## మహిళా సాధికారతకు ప్రభుత్వం పెద్దపీట





**మంత్రి డాక్టర్ ధనసరి సీతక్క**

**ములుగు ప్రజా స్వేచ్ఛ**
రాష్ట్రంలో మహిళలు ఆర్థికంగా ఎదగడానికి ప్రజా ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ రూపొందించిందని, మహిళా సంఘాల్లో నూతన సభ్యులను చేర్పించాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖల మంత్రి డాక్టర్ ధనసరి సీతక్క అన్నారు. గురువారం ములుగు జిల్లా కేంద్రంలోని గిరిజన భవన్‌లో ఇందిరా మహిళా శక్తి సంబురాల్లో భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్‌తో కలిసి మంత్రి పాల్గొన్నారు. వడ్డీ లేని రుణాల చెక్కులు, లోన్ బీమా, ప్రమాద చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మహిళా సంఘాలకు దాదాపు రూ.26వేల కోట్ల బ్యాంక్ లింకేజ్ రుణాలను పంపిణీ చేశామని అన్నారు. మహిళా సంఘాలకు రూ. లక్షల కోట్లు కేటాయించడంతో పాటు వడ్డీ రుణమాఫీ చేసిన ఘనత తమదేనని తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగాల కన్నా ప్రయివేట్ రంగంలో పలు వ్యాపారాల్లో మహిళలు రాణించడానికి అవకాశం ఉందని అన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న సంక్షేమ ఫలాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు సీఈఓ సెర్ప్ పి.కట్యాయని దేవి, ములుగు మార్కెట్ కమిటీ చైర్మెన్ రేగ కళ్యాణి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ బానోత్ రవిచందర్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ సంపత్‌రావు, సంబంధిత అధికారులు, మండల సమాఖ్య సభ్యులు, ఏపీఎంలు, మహిళలు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

జూలై 2025
ప్రజా స్వేచ్ఛ PRAJA SWECHA

# ఇందిరమ్మ ఇండ్లను పరిశీలించిన ఎంపీడీఓ



వలిగొండ ,ప్రజా స్వేచ్ఛ

వలిగొండ మండలంలోని వెలువర్తి.మొగిలి పాక. కేర్చీపల్లి. పులిగిల్ల. కంచనపల్లి. దాసి రెడ్డిగూడెం. గ్రామాలలో ఇందిరమ్మ ఇండ్లను. సానిటేషన్. ఉపాధి హామీ పనులను ఎంపీడీవో జి.జలంధర్ రెడ్డి క్షేత్రస్థాయి పరిశీలన చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేసిందని, ప్రభుత్వ నియమ నిబంధనల ప్రకారం ఇందిరమ్మ ఇండ్ల త్వర తగతిన పూర్తి చేయాలని లబ్ధిదారులకు సూచించారు. ఉపాధి హామీలో భాగంగా ఇంటింటికి మొక్కలు నాటే కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని గ్రామపంచాయతీ కార్యదర్శులకు సూచించారు ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ, పంచాయతీ కార్యదర్శులు లబ్ధిదారులు పాల్గొన్నారు.

## ఆల్విన్ కాలనీ డివిజన్‌లో ఫ్యాషన్ స్టోర్‌ను ప్రారంభించిన కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్




కూకట్‌పల్లి,ప్రజా స్వేచ్ఛ

124 ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని ఎల్లమ్మ బండ మెయిన్ రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన సాండీ ఫ్యాషన్స్ మెన్స్ వేర్ అండ్ సాండి స్పోర్ట్స్‌ను డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై జగద్గిరిగుట్ట సిఐ నరసింహాతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ స్టోర్ నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలుపుతూ మీరు ఏర్పాటు చేసుకున్న ఫ్యాషన్ స్టోర్ మంచి బిజినెస్ జరుపుకొని దినదిన అభివృద్ధి చెందుతూ ఉన్నత స్థానాలకు చేరుకోవాలని కోరుకుంటున్నట్టు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో యువనేత దొడ్ల రామకృష్ణ గౌడ్, అనీల్ రెడ్డి, వెంకట్ నాయక్, గోపాల్, లింగం, సుధాకర్, సత్తయ్య, ఆదర్శ్, మహేష్. ఆకాష్. శివప్రసాద్ కుంచెల. వల్లేపు మోసెస్. అజయ్ పాల్గొన్నారు

## ప్రభుత్వ కళాశాలల్లో నాణ్యమైన విద్య



వలిగొండ ,ప్రజా స్వేచ్ఛ

ప్రభుత్వ కళాశాలల్లో నిష్ణాతులైన అధ్యాపకులతో నాణ్యమైన విద్య అందుతోందని ఇంటర్ బోర్డు జాయింట్ సెక్రెటరీ భీమ్ సింగ్ అన్నారు.మండల కేంద్రంలోని డాక్టర్ పైళ్ల మల్లారెడ్డి సాధన సహకారంతో నిర్మించిన శ్రీ వెంకటేశ్వర ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని వసతులను వారు పరిశీలించారు అనంతరం విద్యార్థుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఇంటర్మీడియట్ దశ కీలకమని విద్యార్థుల భవిష్యత్తును మారుస్తుందని విద్యార్థులు క్రమం తప్పకుండా తరగతులకు హాజరు కావాలన్నారు తల్లిదండ్రులు తమపై పెట్టుకున్న ఆశలను వమ్ము చేయకుండా కష్టపడి ఇష్టంతో చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు ఇంజనీరింగ్ తదితర కోర్సుల్లో ప్రవేశం పొందే విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని అధ్యాపకులకు సూచించారు గతేడాది ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను అభినందించారు ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మీకాంత్ కుమార్ అధ్యాపకులు పరశురాములు కృష్ణ వెంకటాచారి మురళి బిక్షం విజయ్ గోపీనాథ్ విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు

## ప్రజావాణి వినతికి స్పందించిన కలెక్టర్

### ఆరోగ్యశ్రీతో బాబుకు ఉచిత గుండె చికిత్స

కరీంనగర్,ప్రజా స్వేచ్ఛ

కరీంనగర్ జిల్లా చెంజర్ల గ్రామానికి చెందిన రామగిరి అంజయ్య తన ఏడున్నర నెలల బాబు గుండె రంధ్ర సమస్యపై ప్రజావాణిలో దరఖాస్తు చేశారు. జిల్లా కలెక్టర్, వైద్య అధికారులు స్పందించి ఆరోగ్యశ్రీ ద్వారా హైదరాబాద్‌లో 14 జూలై 2025న ఉచిత శస్త్రచికిత్స చేయించారు. ప్రస్తుతం బాబు పరిస్థితి మెరుగ్గా ఉండగా, అధికారులకు అభినందనలు తెలిపారు.ఆరోగ్యశ్రీ ద్వారా చిన్నపిల్లల గుండె ఆపరేషన్లు ఉచితంగా అందుతున్నాయని, ప్రైవేటు ఆసుపత్రుల్లో అప్పుల బారిన పడకుండా ఆరోగ్య మిత్రులను సంప్రదించాలంటూ అధికారుల సూచన.

# నేడు జటప్రోల్ గ్రామానికి సీఎం రేవంత్‌రెడ్డి..





తెలంగాణ న్యాయవాదుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి రిటైర్ జడ్జి కాంగ్రెస్ నాయకుడు రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి

హైదరాబాద్ : ప్రజా స్వేచ్ఛ

నాగర్‌కర్నూల్ జిల్లా పెంట్లవెల్లి మండలంలోని జటప్రోల్ గ్రామానికి శుక్రవారం సీఎం రేవంత్‌రెడ్డి రానున్నారు. ఆ గ్రామంలో రూ. 150 కోట్లతో నిర్మించనున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్‌కు సీఎం శంకుస్థాపన చేయనున్నారు. అనంతరం నిర్వహించే బహిరంగ సభలో పాల్గొని మహిళా సంఘాల సభ్యులకు వడ్డీ లేని రుణాలు అందించనున్నారు.రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సీఎం రేవంత్‌రెడ్డి తొలిసారి కొల్లాపూర్‌కు వస్తున్నందున ప్రోగ్రామ్‌ను సక్సెస్ చేసేందుకు మంత్రి జూపల్లి కృష్ణారావు చర్యలు చేపట్టారు. బహిరంగ సభ కోసం భారీగా జనాన్ని సమీకరించేందుకు ప్లాన్ చేస్తున్నారు. సీఎం పర్యటన నేపథ్యంలో మంత్రితో పాటు కలెక్టర్ బాదావత్ సంతోష్ వివిధ శాఖల ఆఫీసర్లతో సమీక్ష నిర్వహించడంతో ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. బహిరంగ సభకు ముందుగా సీఎం రేవంత్‌రెడ్డి మదనగోపాలస్వామి, శివాలయాన్ని సందర్శించనున్నారు

# పేదోళ్ల ఆరోగ్యానికి కొండంత ఆసరా సీఎం రిలీఫ్ ఫండ్

డా.జి.చిన్నారెడ్డి రాష్ట్ర ప్రణాళిక సంగం ఉపాధ్యక్షులు



వనపర్తి జిల్లా ,ప్రజా స్వేచ్ఛ

ప్రవేట్ కార్పొరేట్ హాస్పిటల్లో అత్యవసర వైద్య సేవలు పొందిన పేదలను ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన సీఎం సహాయనిధి, సీఎంఆర్ఎఫ్ 84 చెక్కులను28,21,500 /-రూపాయలను రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్. జిల్లెల.చిన్నారెడ్డి లబ్ధిదారులకు అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా డా. జి.చిన్నారెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రికార్డు స్థాయిలో సీఎం రిలీఫ్ ఫండ్ ఇస్తున్నామని అన్నారు.పేదలకు ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా కార్పొరేట్ వైద్యం అందించటం జరుగుతుందన్నారు.ఆరోగ్యశ్రీ లేనివారికి చికిత్స అనంతరం సిఎంఆర్ఎఫ్ ద్వారా కొంత ఆర్థిక ఉపశమనం కల్పిస్తున్నామని అన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం పేద ప్రజలను గుర్తించి సంక్షేమానికి కృషి చేస్తుందని అన్నారు.వనపర్తి నియోజకవర్గం లో పార్టీలకు అతీతంగా మానవతా ధృక్పథంతో అందరికీ సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేస్తున్నామని అన్నారు.సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందుకున్న లబ్ధిదారులు సీఎం రేవంత్ రెడ్డి కి,డాక్టర్.జిల్లెల.చిన్నారెడ్డి కి,ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి ప్రధాన కార్యదర్శి నందిమల్ల యాదయ్య,వనపర్తి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్ యాదవ్,రాష్ట్ర మైనార్టీ నాయకులు కమర్ మియా,వనపర్తి జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి చీర్ల జనార్ధన్,వనపర్తి జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు సమద్ మియా,వనపర్తి జిల్లా కోర్ట్ ప్లీడర్ కిరణ్ కుమార్, వనపర్తి పట్టణ ప్రధాన కార్యదర్శి అడ్వకేట్ బాబా,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు శంకర్రావు,వనపర్తి పట్టణ మైనార్టీ సెల్ ఉపాధ్యక్షులు అనీష్,వనపర్తి జిల్లా ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి గట్టు మన్యం,పెద్దమందడి మండల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సి.పెంటన్న యాదవ్,వనపర్తి జిల్లా ఎన్.ఎస్.యు.ఐ అధ్యక్షుడు రోహిత్,వనపర్తి యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ వైస్ ప్రెసిడెంట్ రాగి అక్షయ్, యూత్ కాంగ్రెస్ జనరల్ సెక్రెటరీ ఇర్ఫాన్,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు,రాగి వేణు,వెంకటేశ్వర్ రెడ్డి, మణిగిల్ల బాల్ రాజు,గోవింద్, రాములు,బాలచందర్, సహదేవుడు,అబ్దుల్లా,గోవర్ధన్,ఆనంద్ ,నందిమల్ల సందీప్,పెద్దమందడి సోషల్ మీడియా కోఆర్డినేటర్ గట్టు రాజు, తదితరులు పాల్గొన్నారు.

# మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

సిఐటియు నాయకులు చింతల యాదయ్య




ఘట్కేసర్,ప్రజా స్వేచ్ఛ

ఘట్కేసర్ సిఐటియు ఆఫీసులో మధ్యాహ్న భోజన కార్మికుల సమావేశం జరిగింది దీనికి ముఖ్య అతిథిగా హాజరైన సిఐటియు నాయకులు చింతల యాదయ్య మాట్లాడుతూ మధ్యాహ్న భోజన కార్మికులకు ప్రతినెల జీతాలు రావటం లేదని బిల్లులు రావడం లేదని కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు వచ్చిన రాష్ట్ర ప్రభుత్వం ఆ నిధులను రిలీవ్ చేయకుండా ఐదారు నెలకు ఒకసారి కూడా బిల్లులు వేయకుండా మధ్యాహ్న భోజన కార్మికులను ఈ ప్రభుత్వము ఇబ్బందులకు గురి చేస్తుందని చింతల యాదయ్య ఆవేదన వ్యక్తం చేశారు అదేవిధంగా కేంద్ర ప్రభుత్వము వచ్చే నెల 15వ తారీకు నుండి ప్రతి పాఠశాలలో గ్యాస్ తోటి భోజనాలు వండాలని లేనియెడల వారిపై కఠిన చర్యలు ఉంటాయని ఒక ప్రకటన చేయటం మధ్యాహ్న భోజన కార్మికులకు ఆందోళన కలిగిస్తున్నది గుడ్డు బిల్లులు ఒకసారి పిల్లల మెనూ ప్రకారం వచ్చే బిల్లును మరొకసారి వేస్తున్నారు అదేవిధంగా పాఠశాలలో హెడ్మాస్టర్లది మధ్యాహ్న భోజన కార్మికుల మీద వేధింపులు విపరీతంగా పెరిగినాయి ఈ సమస్యల మీద రేపు అనగా 18 7 2025 ఉదయం కలెక్టర్ ఆఫీస్ ముందు మధ్యాహ్న భోజన కార్మికుల ధర్నాను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు శనివారం రోజు ఎంఈఓ ని కలిసి వినతిపత్రం ఇవ్వాలని నిర్ణయించారు తదనంతరము రెండు మూడు రోజులలో కార్మికులకు బిల్లు రాకపోతే ఎంఈఓ ఆఫీస్ ముందు దీక్షలు చేయటానికి కూడా వెనకాడొద్దని యాదయ్య కార్మికులకు పిలుపునివ్వడం జరిగింది ఈ యొక్క సమావేశంలో శ్రీనివాస్ పుష్ప వరలక్ష్మి కవిత శ్రీ రాజా చారి విజయలక్ష్మి భాగ్య జ్యోతి తదితరులు పాల్గొన్నారు

## బిజినెస్

# 5 వేల మందిని తొలగిస్తున్నాం.. లేఆఫ్స్ ప్రకటించిన ఇంటెల్




ప్రపంచవ్యాప్తంగా టెక్ ఉద్యోగాల కోత కొనసాగుతున్నది. ఆర్థిక అస్థిరతతో గ్లోబల్ మార్కెట్లలో ఒత్తిడి, లాభాల క్షీణత, ఏఐ వినియోగం పెరగడం.. వెరసి కంపెనీలు ఖర్చులు తగ్గించుకునేందుకు ప్రయత్నిస్తున్నాయి. ఇందులో భాగంగా పెద్ద ఎత్తున ఉద్యోగులను తొలగిస్తున్నాయి. తాజాగా చిప్ తయారీ సంస్థ ఇంటెల్ తన ఉద్యోగులకు షాక్ ఇచ్చింది. ఈ వారంలో 5 వేల మందికిపైగా ఉద్యోగులను తొలగిస్తున్నట్లు ప్రకటించింది.కాగా, ఇంటెల్ 4 వేల మంది ఉద్యోగులకు లేఆఫ్స్ ప్రకటించనున్నట్లు ఇటీవలే అంచనాలు వెలువడిన విషయం తెలిసిందే. అయితే, 4 వేల మంది కాదని, 5 వేల మందిని తొలగిస్తున్నట్లు సంస్థ తాజాగా ప్రకటించింది. ఈ వారంలోనే అమెరికా వ్యాప్తంగా తొలగింపులు ఉంటాయని స్పష్టం చేసింది. ఖర్చులు తగ్గించుకోవడంలో భాగంగా లే ఆఫ్‌లు అమలు చేస్తున్నట్లు వెల్లడించింది. ఒరెగాన్, కాలిఫోర్నియాలో ఎక్కువగా తొలగింపులు ఉంటాయని పేర్కొంది. ఇందులో కాలిఫోర్నియా ఆఫీస్ నుంచి 1,935 మంది, ఒరెగాన్ యూనిట్ నుంచి 2,392 మంది తమ ఉద్యోగాలను కోల్పోనున్నట్లు తెలిసింది. అరిజోనా కార్యాలయం నుంచి 696 మందిపై వేటు పడనున్నట్లు సమాచారం. ఈ ఏడాది మార్చిలో ఇంటెల్ కొత్త సీఈఓగా లిప్-బు టాన్ బాధ్యతలు స్వీకరించిన విషయం తెలిసిందే. ఆయన ఆధ్వర్యంలో భారీ పునర్వ్యవస్థీకరణ చేపడుతున్న ఇంటెల్, తన ఉద్యోగుల్లో 20 శాతానికి పైగా తొలగించాలని యోచిస్తోంది. ఇందులో భాగంగానే లేఆఫ్స్‌ను ప్రకటించింది.

# ఈ రోజు బంగారం, వెండి ధరలు ఎలా ఉన్నాయంటే..

బంగారం ధర మళ్లీ లక్ష రూపాయలకు దగ్గరల్లో ట్రేడ్ అవుతోంది. గత వారంలో 98 వేలకు దగ్గర్లో ఉన్న పది గ్రాముల బంగారం ప్రస్తుతం తిరిగి లక్ష రూపాయలు చేరువ అయింది. ఈ నేపథ్యంలో (జులై 17న) ఉదయం 6.30 గంటల సమయానికి 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ. రూ. 99, 270కి చేరింది. 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. రూ. 90, 990కి చేరింది. నిన్నటితో పోల్చుకుంటే దాదాపు రూ.500 వరకు తగ్గింది.

ఢిల్లీలో 24 క్యారెట్ల పసిడి రేటు 10 గ్రాములకు రూ. 99, 420కి చేరుకోగా, 22 క్యారెట్ల గోల్డ్ ధర 10 గ్రాములకు రూ. 91, 140కి చేరుకుంది. ఇక హైదరాబాద్, విజయవాడలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 99, 270కి చేరుకోగా, 22 క్యారెట్ల 10 గ్రాముల గోల్డ్ రేటు రూ. 90, 990కి చేరింది. వెండి ధరలు నిన్నటితో పోల్చుకుంటే వంద మేర తగ్గాయి. ఈ క్రమంలో దేశంలోని ప్రధాన నగరాల్లో ఉన్న బంగారం, వెండి రేట్లను ఇప్పుడు తెలుసుకుందాం.



దేశంలోని ప్రధాన నగరాల్లో బంగారం రేట్లు (10 గ్రాములకు) (24 క్యారెట్, 22 క్యారెట్)

హైదరాబాద్‌లో రూ. 99, 270, రూ. 90, 990
విజయవాడలో రూ. 99, 270, రూ. 90, 990
ఢిల్లీలో రూ. 99, 420, రూ. 91, 140
ముంబైలో రూ. 99, 270, రూ. 90, 990
వడోదరలో రూ. 99, 320, రూ. 91, 040
కోల్‌కతాలో రూ. 99, 270, రూ. 90, 990
చెన్నైలో రూ. 99, 270, రూ. 90, 990
బెంగళూరులో రూ. 99, 270, రూ. 90, 990
కేరళలో రూ. 99, 270, రూ. 90, 990

పుణెలో రూ. 99, 270, రూ. 90, 990

**ప్రధాన నగరాల్లో వెండి ధరలు (కేజీకి)**

హైదరాబాద్‌లో రూ. 1, 23, 900
విజయవాడలో రూ. 1, 23, 900
ఢిల్లీలో రూ. 1, 13, 900
చెన్నైలో రూ. 1, 23, 900
కోల్‌కతాలో రూ. 1, 13, 900
కేరళలో రూ. 1, 23, 900
ముంబైలో రూ. 1, 13, 900
బెంగళూరులో రూ. 1, 13, 900
వడోదరలో రూ. 1, 13, 900
అహ్మదాబాద్‌లో రూ. 1, 13, 900

# స్వల్ప నష్టాల్లో స్టాక్‌మార్కెట్లు..

భారత్‌తో ఇండోనేసియా తరహా వాణిజ్యం ఒప్పందం చేసుకుంటామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొనడం మదుపర్లను కలవరపెడుతోంది. అలా అయితే దేశీయ తయారీ రంగానికి ఇబ్బందులు తప్పవని నిపుణులు హెచ్చరిస్తున్నారు. అలాగే రష్యాతో వ్యాపారం చేస్తే వంద శాతం సుంకాలు విధిస్తామని భారత్, చైనాలకు నాటో దేశాలు హెచ్చరికలు చేయడం కూడా మర్కెట్లను కలవరపరుస్తోంది. ఈ నేపథ్యంలో ప్రస్తుతం సెన్సెక్స్, నిఫ్టీ స్వల్ప నష్టాల్లో కదలాడుతున్నాయి బుధవారం ముగింపు (82, 634)తో పోల్చుకుంటే గురువారం ఉదయం వంద పాయింట్లకు పైగా లాభంతో మొదలైన సెన్సెక్స్ ఆ తర్వాత నష్టాల బాట పట్టింది. ఒక దశలో దాదాపు 100 పాయింట్లు కోల్పయి 82, 532 వద్ద కనిష్టానికి




చేరింది. ప్రస్తుతం ఉదయం 10:00 గంటల సమయంలో సెన్సెక్స్ 69 పాయింట్ల నష్టంతో 82, 565 వద్ద కొనసాగుతోంది. మరో వైపు నిఫ్టీ కూడా సెన్సెక్స్ బాటలోనే సాగుతోంది. ప్రస్తుతానికి 22 పాయింట్ల నష్టంతో 25, 189 వద్ద కొనసాగుతోంది.సెన్సెక్స్‌లో బ్లూ స్టార్, ఏంజెల్ వన్, ప్రెస్టీజ్ ఎస్టేట్, సోనా బీఎల్‌డబ్ల్యూ, కేఈఐ ఇండస్ట్రీస్ షేర్లు లాభాల్లో ఉన్నాయి. ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్, యూనియన్ బ్యాంక్, మ్యాక్స్ ఫైనాన్సియల్, ఎల్‌టీఐ మైండ్ ట్రీ, ఇండియన్ బ్యాంక్ షేర్లు నష్టాల బాటలో కొనసాగుతున్నాయి. నిఫ్టీ మిడ్ క్యాప్ ఇండెక్స్ 5 పాయింట్ల స్వల్ప నష్టంతో ఉంది. బ్యాంక్ నిఫ్టీ 73 పాయింట్ల నష్టంతో కొనసాగుతోంది. డాలర్‌తో పోల్చుకుంటే రూపాయి మారకం విలువ 85.83గా ఉంది.

# కోచ్‌గా సెకండ్ ఇన్నింగ్స్.. దాదాతో పోటీపడుతున్న సాహా..!


భారత మాజీ క్రికెటర్ వృద్ధిమాన్ సాహా సెకండ్ ఇన్నింగ్స్ ప్రారంభించనున్నాడు. ఆరు నెలల క్రితమే అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికిన అతడు త్వరలోనే కోచ్‌గా అవతారం ఎత్తనున్నాడు. దేశవాళీలో, ఐపీఎల్‌లో సుదీర్ఘ అనుభవం కలిగిన సాహా బెంగాల్ అండర్ -23 జట్టుకు కోచ్‌గా సేవలందించనున్నాడు. ఓపెనర్‌గా, వికెట్ కీపర్‌గా చెరగని ముద్రవేసిన అతడితో ఒప్పందం చేసుకునేందుకు బెంగాల్ క్రికెట్ సంఘం (క్యాబ్) ఆసక్తి కనబరుస్తోంది. అయితే.. బీసీసీఐ, క్యాబ్ మాజీ అధ్యక్షుడు, సౌరభ్ గంగూలీ నుంచి అతడికి పోటీ ఎదురవుతోంది.'అండర్ -23 జట్టుకు కొత్త కోచ్ కోసం వెతుకున్నాం. ఈ నేపథ్యంలోనే వచ్చే వారం క్యాబ్ అధికారులు ప్రత్యేకంగా సమావేశం కానున్నారు. ప్రస్తుతానికి కోచ్ పదవికి వృద్ధిమాన్ సాహా పేరు పరిశీలనలో ఉంది. అయితే.. సౌరభ్ గంగూలీ, పంకజ్ రాయ్‌లు కూడా రేసులో ఉన్నారు. ఈ ముగ్గురిలో కోచ్‌గా బాధ్యతలు చేపట్టేది ఎవరు? అనేది త్వరలోనే తెలియనుంది' అని క్యాబ్ సీనియర్ అధికారి తెలిపాడు. 40 టెస్టు మ్యాచ్‌లు, 9 వన్డేలు బ్యాటర్,




వికెట్ కీపర్ అయిన సాహా భారత జట్టు తరపున 40 టెస్టు మ్యాచ్‌లు, 9 వన్డేలు ఆడాడు. 2021లో జట్టుకు దూరమైన సాహా ఆ తర్వాత ఐపీఎల్‌కే పరిమితం అయ్యాడు. గుజరాత్ టైటాన్స్ (Gujarat Titans) తరఫున విధ్వంసక ఇన్నింగ్స్‌లు ఆడిన అతడిని 18వ సీజన్‌కు ముందు గుజరాత్ వదిలించుకుంది. రంజీ ట్రోఫీలో బెంగాల్ లీగ్ దశలోనే నిష్క్రమించడంతో జనవరిలో ఫస్ట్ క్లాస్ క్రికెట్ నుంచి రిటైర్ అయ్యాడీ బెంగాల్ స్టార్.

# దూసుకొస్తున్నాడు మన బోల్ట్.. అథ్లెటిక్స్‌లో కొత్త చరిత్ర సృష్టిస్తాడా..!

క్రికెట్.. హాకీ.. బ్యాడ్మింటన్.. నీరజ్ చోప్రా రాకతో ఈమధ్య కాలంలో జావెలిన్ త్రోలో భారతదేశం పేరు విశ్వవేదికపై మార్మోగిపోతోంది. కానీ, అథ్లెటిక్స్‌లో మాత్రం ఆసియా క్రీడల వరకే మనోళ్ల విజయాలు పరిమితం అయ్యాయి. కరణం మల్లీశ్వరీ, పీటి ఉష.. అంజూ బీజార్జ్.. కుంజరాణి వంటి వారు దేశ ప్రతిష్టను పెంచినా.. ఆ తర్వాతి తరం వీళ్ల వారసత్వాన్ని అందిపుచ్చుకోలేకపోయింది. అవినాష్ సబ్లే, పరుల్ చౌదరీ, జ్యోతి ఎర్రాజీలు ఫర్వాలేదనిపిస్తున్నా ట్రాక్ అండ్ ఫీల్డ్ మీద చిరుతాల పరుగెత్తి పతకాలు కొల్లగెట్టే అథ్లెట్లు కరువయ్యారు. అయితే.. అనిమేశ్ కుజుర్ రూపంలో భారత్‌కు 'ఉసేన్ బోల్ట్' లాంటి పరుగుల వీరుడు దొరికాడు. బుల్లెట్




వేగంతో దౌడు తీస్తూ జాతీయ స్థాయిలో రికార్డులు బద్దలు కొడుతున్న ఈ యువకెరటం.. టోక్యోలో జరుగబోయే వరల్డ్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్స్ మీద గురి పెట్టాడు. ఈ పోటీలకు అర్హత సాధించాడంటే అనిమేశ్ చరిత్ర సృష్టించడం ఖాయం. ట్రాక్ మీద రాకెట్ వేగంతో దూసుకెళ్లే అనిమేశ్ కుజుర్‌ది ఛత్తీస్‌గఢ్‌లోని మారుమూల గ్రామం. ఆరడుగుల రెండు అంగుళాల పొడవుండే ఇతడు టీనేజ్ నుంచే తన స్పీడ్‌తో అందర్నీ ఆశ్చర్యపరుస్తున్నాడు. ఈమధ్యే 100 మీటర్ల దూరాన్ని 10.18 సెకన్లలో చేరుకొని చరిత్ర సృష్టించాడు. తద్వారా గురిందెర్వీర్ (10.20 సెకన్లు) పేరిట ఉన్న జాతీయ రికార్డును బద్ధలు కొట్టి ది 'ఫాస్టెస్ట్ మ్యాన్ ఆఫ్ ఇండియా'గా అవతరించాడు అనిమేశ్.

## స్పోర్ట్స్

# సాత్విక్ - చిరాగ్ జోడీకి షాక్.. రెండో రౌండ్‌లోనే లక్ష్య సేన్ ఓటమి



జపాన్ ఓపెన్ సూపర్ 750 బ్యాడ్మింటన్ టోర్నీలో భారత స్టార్లకు వరుస పరాజయాలు ఎదురవుతున్నాయి. మహిళల సింగిల్స్‌లో పీవీ సింధు తొలి రౌండ్‌లోనే నిష్క్రమించగా.. లక్ష్య సేన్, సాత్విక్ -చిరాగ్ ఆమెను అనుసరిస్తూ ఇంటిదారి పట్టారు. గురువారం జరిగిన పురుషుల సింగిల్స్ రెండో రౌండ్‌లో ఎనిమిదో ర్యాంకర్ సేన్ తేలిపోయాడు. స్థానిక ఆటగాడు కొడాయ్ నరొకా చేతిలో 19-21, 11-21తో అనూహ్యంగా కంగుతిన్నాడు.బుల్స్‌లో ఫేవరెట్లుగా బరిలోకి దిగిన సాత్విక్ సాయిరాజ్ - చిరాగ్ శెట్టి ద్వయం తొలి రౌండ్‌లో అద్భుత విజయం సాధించింది. అయితే.. రెండో రౌండ్‌లో మాత్రం ఐదో సీడ్ జంట ధాటికి చేతులెత్తేసింది భారత జోడీ. గురువారం హోరాహోరీగా జరిగిన పోరులో లియాంగ్ వీ కెంగ్ వాంగ్ చాంగ్ (చైనా) జంటకు బదులివ్వలేకపోయింది చిరాగ్ ద్వయం.తొలి సెట్‌లో గట్టిగానే పోరాడినా..22-24తో వెనకబడింది. రెండో సెట్‌లో పుంజుకుంటారనుకుంటే బలహీనమైన డిఫెన్స్ కారణంగా 14-21తో దారుణ ఓటమి చవిచూసింది. ఈ పరాజయంతో చైనీస్ షట్లర్లు భారత స్టార్లపై తమ విజయాల ఆధిక్యాన్ని 7-2కు పెంచుకున్నారు.




# అనుపమ పరమేశ్వరన్ 'పరదా' నుంచి థీమ్ సాంగ్ విడుదల

మలయాళీ బ్యూటీ అనుపమ పరమేశ్వరన్ లీడ్ రోల్‌లో నటిస్తున్న తాజా చిత్రం 'పరదా' . ఈ సినిమాకు సినిమా బండి , శుభం సినిమాల ఫేమ్ ప్రవీణ్ కాంద్రేగుల దర్శకత్వం వహిస్తున్నాడు. శ్రీధర్ మక్కువ, విజయ్ డొంకాడ నిర్మిస్తున్నారు. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం ఆగష్టు 22న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ సందర్భంగా మూవీ నుంచి 'యత్ర నార్యస్తు పూజ్యంతే..' థీమ్ ఆఫ్ పరదా సాంగ్‌ను మేకర్స్ విడుదల చేశారు. ఈ పాటకు వనమాలి సాహిత్యం అందించగా.. అనురాగ్ కులకర్ణి పాడాడు. గోపి సుందర్ సంగీతం అందించాడు.సంప్రదాయపు కట్టుబాట్లు మహిళలను ఎలా అణచివేస్తున్నాయి. ఎలా ఎదగకుండా అణగదొక్కుతున్నాయి.. వాటిని దాటి మహిళలు ఎలా ఎదుగుతున్నారు అనే సోషియో డ్రామా కథాంశంతో ఈ సినిమా రాబోతుంది. మలయాళ నటి దర్శన.. సంగీత ఇందులో కీలక పాత్రలో నటిస్తున్నారు.

# కవిన్ సరసన ప్రియాంక...

మూడు పదుల వెన్నెల సోన ప్రియాంక అరుల్ మోహన్ కు ఇంకా గ్రాండ్ విక్టరీ దొరకలేదు. అయితే... తమిళంలో ఆమె నటించిన 'డాక్టర్, డాన్ ' చిత్రాలు కొంతలో కొంత ఊరటను కలిగించాయి. ప్రస్తుతం పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ సరసన 'ఓజీ' లో నటిస్తోంది ప్రియాంక అరుల్ మోహన్. పాన్ ఇండియా స్థాయిలో విడుదల కాబోతున్న 'ఓజీ' పై అమ్మడు భారీ ఆశలే పెట్టుకుంది.తెలుగులోనూ ఇప్పటికే నటిగా తన సత్తా చాటడానికి శతవిధాలా ప్రయత్నించింది. నానిస్ 'గ్యాంగ్ లీడర్'తో టాలీవుడ్ ఎంట్రీ ఇచ్చిన ప్రియాంక... ఆ తర్వాత శర్వానంద్ సరసన 'శ్రీకారం'లో నటించింది. ఈ రెండు సినిమాలు ఆశించిన స్థాయిలో ఆడలేదు. అయితే 'గ్యాంగ్ లీడర్'లో ఆమె చేసిన పాత్ర మంచి గుర్తింపును తెచ్చిపెట్టింది. అందుకే మరోసారి నాని సరసన 'సరిపోదా శనివారం' లో ఛాన్స్ దక్కించుకుంది. ఈ సినిమా కూడా బాక్సాఫీస్ బరిలో మిస్ ఫైర్ అయింది.ఇదిలా ఉంటే... ప్రియాంక అరుల్ మోహన్ కు ఇప్పుడో కొత్త ప్రాజెక్ట్ లభించింది. హీరో కవిన్ తొమ్మిదో చిత్రంలో ఆమె హీరోయిన్ గా నటించబోతోంది. ఈ సినిమాకు సంబంధించిన అధికారిక ప్రకటన వెలువడింది. కెన్ రాయ్ సన్ దర్శకత్వం వహించే ఈ సినిమా త్వరలోనే పట్టాలెక్కబోతోంది. థింక్ స్టూడియోస్ సంస్థ ఈ రొమాంటిక్ కామెడీ మూవీని ప్రొడ్యూస్ చేబోతోంది. 'కొత్త ప్రయాణం... కొత్త సినిమా' అంటూ వీరు సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టారు. కవిన్ సరసన ప్రియాంక తొలిసారి నటిస్తోంది. మరి సెప్టెంబర్ 25న రాబోతున్న 'ఓజీ'తో ప్రియాంక స్టార్ హీరోయిన్ కేటగిరిలోకి చేరిపోతుందేమో చూడాలి.



# రంగుల్లో వెన్నెలలా.. కలర్‌ఫుల్ డ్రెస్‌లో అదిరిపోయిన కీర్తి!

బ్యూటీ కీర్తి సురేష్ గురించి ప్రత్యేక పరిచయం అవసరం లేదు. రామ్ పోతినేని నేను శైలజా సినిమాతో ఈ ముద్దుగుమ్మ టాలీవుడ్ లోకి ఎంట్రీ ఇచ్చింది. ఈ సినిమాతో మంచి ఫేమ్ సంపాదించుకొని, అనతికాలంలోనే ఈ ముద్దుగుమ్మ స్టార్ నటిగా తన సత్తా చాటుకుంది. వరసగా స్టార్ హీరోల సరసన నటించి మంచి క్రేజ్ సొంతం చేసుకుంది.ఈ బ్యూటీ తెలుగులో అగ్రహీరోలందరి సినిమాల్లో నటించి మంచి ఫేమ్ సంపాదించుకున్న విషయ తెలిసిందే. ఇక ప్రస్తుతం ఈ అమ్మడుకు తెలుగులో అవకాశాలు తగ్గడంతో ఈ ముద్దుగుమ్మ బాలీవుడ్ చెక్కేసి, అక్కడ వరసగా సినిమాలు చేస్తూ ఫుల్ బిజీ అయిపోయింది. బేబీజాన్ సినిమాతో బాలీవుడ్ ప్రేక్షకులను పలకరించిన ఈ బ్యూటీ, బాలీవుడ్ లోనే మరో ప్రాజెక్ట్ కూడా సైన్ చేసినట్లు తెలుస్తుంది.ఇక ఇదిలా ఉంటే ఈ బ్యూటీ తన చిన్ననాటి స్నేహితుడు ఆంటోని థట్టిల్ ను డిసెంబర్ 12,2024లో బంధుమిత్రుల సమక్షంలో పెళ్లి చేసుకున్న విషయం తెలిసిందే. ఇక పెళ్లి తర్వాత ఈ బ్యూటీ గ్లామర్ మరింత పెంచిందనే చెప్పాలి. ఎందుకంటే ఈ మధ్య ఈ అమ్మడు తన అంద చందాలతో సోషల్ మీడియాలో తెగ హల్ చల్ చేస్తుంది.తాజాగా ఈ బ్యూటీ మల్టీ కలర్ ఫ్రాక్‌లో తన అభిమానుల ముందుకు వచ్చింది. ఈ ఫోటోల్లో ఈ ముద్దుగుమ్మ అందానికి ఎవ్వరైనా సరే ఫిదా అయిపోవాల్సిందే. అంతలా తన అంద చందాలతో మాయ చేస్తుంది ఈ బ్యూటీ. ప్రస్తుతం దీనికి సంబంధించిన ఫొటోలు ఈ అమ్మడు తన సోషల్ మీడియాలో షేర్ చేయడంతో ఇవి నెట్టింట తెగ వైరల్ అవుతున్నాయి.అయితే ఈ బ్యూటీ ధరించిన ఫ్రాక్ వివిధ రంగులతో ఉండటంతో, ఈ ఫొటోస్ చూసిన ఈ బ్యూటీ అభిమానులు ఏంటీ కీర్తి.. ఈ అతుకుల డ్రెస్ ఎక్కడ కుట్టించావు అంటూ కామెంట్స్ చేస్తున్నారు. ఇంకొందరేమో, పాత సినిమా ట్రెండ్ గుర్తు చేశావంటూ కీర్తిని పొగిడేస్తున్నారు.



# అందరూ సర్‌ప్రైజ్ అవుతారు!

'యానిమల్' సినిమాతో దేశవ్యాప్తంగా యువతలో మంచి క్రేజ్ సంపాదించుకుంది త్రిప్తి దిమ్రి. . ప్రభాస్-సందీప్‌రెడ్డి వంగా 'స్పిరిట్' చిత్రం నుంచి దీపికా పదుకోన్ తప్పుకోవడంతో ఆమె స్థానంలో త్రిప్తి దిమ్రిని నాయికగా ఎంపిక చేశారు. తాజా ఇంటర్వ్యూలో ఈ భామ తాను నటిస్తున్న సినిమాల విశేషాలను వెల్లడించింది."స్పిరిట్' సినిమా కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నా. బలమైన భావోద్వేగాలు కలబోసిన కథ ఇది. ఈ సినిమాలోని ఎలిమెంట్స్ అందరిని సర్‌ప్రైజ్ చేస్తాయి. నా కెరీర్‌లో మరో ఉత్తమ చిత్రంగా మిగిలిపోతుందనే నమ్మకం ఉంది. విశాల్ భరద్వాజ్ దర్శకత్వంలో ఓ సినిమా చేస్తున్నా. అదొక అద్భుతమైన కథ. కెరీర్ ఆరంభంలోనే ప్రతిభావంతులైన దర్శకులతో పనిచేయడం గొప్ప అదృష్టంగా భావిస్తున్నా' అని చెప్పింది.



# నువ్వుంటే చాలే' అంటున్న రామ్ పోతినేని!




ఎనర్జిటిక్ స్టార్ రామ్ పోతినేని, దర్శకుడు మహేష్ బాబు పీ కాంబినేషన్‌లో వస్తున్న 'ఆంధ్ర కింగ్' చిత్రంపై భారీగా అంచనాలు నెలకొన్న విషయం తెలిసిందే. ఇప్పటికే విడుదలైన ఈ సినిమా టైటిల్ గ్లింప్స్‌కు అద్భుతమైన స్పందన లభించింది. దీంతో తాజాగా చిత్ర బృందం సినిమాలోని మొదటి సింగిల్ 'నువ్వుంటే చాలే' ప్రోమోను విడుదల చేసింది. ఈ పాట యొక్క పూర్తి వెర్షన్‌ను జులై 18న విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. రామ్ లిరిక్స్ అందించిన ఈ పాటకు వివేక్ మార్విన్ సంగీతం అందిస్తుండగా.. అనిరుధ్ రవిచందర్ పాడాడు.రామ్ ఒక సూపర్ స్టార్‌కి డై-హార్డ్ అభిమానిగా కనిపించబోతున్న ఈ చిత్రంలో కన్నడ స్టార్ హీరో ఉపేంద్ర ముఖ్య పాత్రలో నటిస్తుండగా, భాగ్యశ్రీ బోర్స్ కథానాయికగా నటిస్తుంది. రావు రమేష్, మురళి శర్మ, సత్య, రాహుల్ రామకృష్ణ, విటివి గణేష్ ఇతర ప్రముఖ నటీనటులు కీలక పాత్రలలో కనిపించనున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ ఈ చిత్రాన్ని నిర్మిస్తుంది.

Printed published and woned by Tarigolpula Lakshmi, mahender ,printers karshak Art Printers, Hyderabad and published by office 2-6-376, Jaipuri colony,Nogole village,Uppal mandal, district Ranga Reddy,Post GSI,500068-Telangana RNI NO.APTEL/2012/46853 . Email ID : Prajaswecha@gmail.com, website, www.Prajaswecha.com cell 9381910611, 79892 89492